RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 56 బుధవారం, మార్చి 27, 2024 పేజీలు : 4

### విశ్వసుందరి పోటీలో సౌదీ తొలి ఎంట్రీ

న్యూఢిల్లీ : సౌదీ అరేబియా అధికారికంగా విశ్వ సుందరి పోటీలో పాల్గొంటున్నది. ఇస్లామిక్ దేశం మొట్టమొదటి ప్రతినిధిగా రూమీ అల్కహ్తానీ పాల్గొనబోతున్నది. సనాతన దృక్పథాన్ని వీడుతున్న సౌదీ అరేబియా తీసుకుంటున్న మొదటి చర్య ఇది. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సయీద్ హయాంలో సౌదీ క్రమంగా సంప్రదాయ దృక్పథానికి వీడ్కోలు పలుకుతోంది. 27 ఏళ్ల మోడల్ రూమీ అల్కహ్తానీ అంతర్జాతీయ అందాల పోటీలో తమ దేశం తరఫున తొలి అభ్యర్థిని కాబోతున్నానని ఇన్‌స్టాగ్రామ్‌లో సోమవారం వెల్లడించింది.

# అటువంటి భాషకు తావే లేదు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనాతే సోషల్ మీడియా విభాగంలో కంగనా రనౌత్‌పై పోస్ట్ అయిన వివాదాస్పద వ్యాఖ్యలపై వివాదం రేగిన నేపథ్యంలో కాంగ్రెస్ మంగళవారం స్పందిస్తూ, సార్వత్రిక చర్చలో అటువంటి భాషకు తావే లేదని తాను ఎల్లప్పుడూ విశ్వసిస్తుంటానని, శ్రీనాతే వివరణతో ఈ వివాదం అంతం కావాలని పేర్కొన్నది. తన అకౌంట్‌ను ఉపయోగించిన వేరొకరు ఆ పోస్ట్ చేసినట్లు శ్రీనాతే ఇప్పటికే వివరించారని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ విలేకరుల గోష్ఠిలో తెలిపారు. 'ఆ పని ఎవరు చేశారో తాను కనుక్కుంటానని ఆమె చెప్పారు' అని దీక్షిత్ తెలిపారు. 'సార్వత్రిక చర్చలో అటువంటి భాషకు తావే లేదు. ఆ విషయంలో కాంగ్రెస్‌ది ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరే. ఆ పని ఎవరు చేసినా అది తప్పేనని సుప్రియా జీ చెప్పారు. ఆమె వివరించారు. ఈ వ్యవహారం ఇంతటితో ముగియాలి' అని దీక్షిత్ అన్నారు. కంగనా రనౌత్, మండిపైన కించపరిచే వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతలు శ్రీనాతే, హెచ్ఎస్ ఆహిర్ సోషల్ మీడియా అకౌంట్లలో పోస్ట్ అయిన తరువాత పార్టీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నది.

## రేఖా పాత్ర..
# మీరు శక్తి స్వరూపిణి!



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో మహిళలు ఎదుర్కొంటున్న అకృత్యాలపై గళమెత్తి బసీర్‌హాట్ నుంచి బిజెపి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేఖా పాత్రను శక్తి స్వరూపిణిగా ప్రధాని నరేంద్ర మోడీ అభివర్ణించారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, స్థానిక టిఎంసి నాయకుడు షాజహాన్ షేక్, అతని అనుచరులు సాగిస్తున్న అకృత్యాలకు వ్యతిరేకంగా గళమెత్తిన రేఖా పాత్రను బిజెపి బసీర్‌హాట్ నియోజకవర్గానికి అభ్యర్థిగా బిజెపి ఎంపిక చేసింది. సందేశ్‌ఖాలీ గ్రామం ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. మంగళవారం ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోడీ ఎన్నికల ఏర్పాట్లు, ఓటర్ల నుంచి బిజెపికి వస్తున్న మద్దతు గురించి అడిగితెలుసుకున్నారని బిజెపి నాయకులు తెలిపారు. రేఖా పాత్రను శక్తి స్వరూపిణిగా ప్రధాని మోడీ అభివర్ణిస్తూ ఆమె టిఎంసి నేతల దురాగతాలకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాన్ని ప్రశంసించారు. పశ్చిమ బెంగాల్‌లోని 42 లోక్‌సభ నియోజకవర్గాలలో ఒకటైన బసీర్‌హాట్‌కు ప్రస్తుతం టిఎంసి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇడి అధికారులపై దాడికి సంబంధించి అరెస్టయిన షాజహాన్ షేక్, అతని అనుచరులు కొందరు ప్రస్తుతం సిబిఐ కస్టడీలో ఉన్నారు. షేక్‌ను టిఎంసి పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

# ఉద్యోగాల హామీతో బిజెపి తప్పుదోవ పట్టిస్తోంది



న్యూఢిల్లీ : ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామనే వాగ్దానంతో ప్రజలను భారతీయ జనతా పార్టీ (బిజెపి) 'తప్పుదోవ పట్టిస్తోంది' అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం ఆరోపించారు. బిజెపి తమకు అబద్ధాలు చెప్పిందా అని దేశవ్యాప్తంగా యువత ఆ పార్టీని ప్రశ్నిస్తున్నట్లు రాహుల్ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. బిజెపి సృష్టించిన భ్రమ గూడును ఛేదించడం ద్వారా యువత తమ భవితను తావే తీర్చిదిద్దుకోవలసి ఉంటుందని కూడా రాహుల్ సూచించారు. ఎన్నికలకు ముందు యువతకు కాంగ్రెస్ చేసిన వాగ్దానం 'యువ న్యాయ్' ద్వారా ఉద్యోగాల విప్లవాన్ని చేపట్టాలని పార్టీ తీర్మానించినట్లు ఆయన తెలియజేశారు. 'నరేంద్ర మోడీజీ ! ఉపాధి కల్పన విషయమై మీకు ఏదైనా ప్లాన్ ఉన్నదా? ప్రతి యువత పెదవులపై ఇప్పుడు నానుతున్న ప్రశ్న ఇది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామనే అబద్ధాన్ని ఎందుకు చెప్పారని ప్రతి వీధిలో, గ్రామంలో బిజెపిని ప్రజలు అడుగుతున్నారు' అని రాహుల్ తెలియజేశారు. 'యువ న్యాయ్ కింద ఉద్యోగాల విప్లవం చేపట్టాలని కాంగ్రెస్ తీర్మానించింది. మేము అధికారంలోకి రాగానే చేసే పని అదే అన్నది మా గ్యారంటీ. మేము 30 లక్షల ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తాం. ప్రతి విద్యాధిక యువకునికకకి'పెహ్లీ నౌకరీ పక్కీ' పథకం కింద ఏటా లక్ష రూపాయలు వచ్చే ఉద్యోగాన్ని ప్రతి యువకునికి ఇస్తాం. చట్టం చేయడం ద్వారా పరీక్ష పత్రాల లీక్‌కు స్వస్తి పలుకుతాం' అని రాహుల్ గాంధీ తెలియజేశారు. నిరుద్యోగితపై బిజెపి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ లక్ష్యం చేసుకున్నది.

## పిఠాపురానికి ఆరు గ్యారెంటీలు..
# ప్రకటించిన జనసేనాని



**పిఠాపురం:** సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానున్న వేళ ఏపీలో తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. కొన్ని సీట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పవన్ కల్యాణ్ పోటీ చేయబోతోన్నారు. ఇప్పటికే ఆయన అభ్యర్థిత్వం ఖరారైంది. ఇక నియోజకవర్గంలో ప్రచారానికి సిద్ధపడుతున్నారు. ఈ నెల 30న ఆయన పిఠాపురానికి వెళ్లనున్నారు. వారాహి వాహనంలో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన చేపట్టనున్నారు. దీనితో పాటు జనసేన పార్టీ అధినేతగా అన్ని జిల్లాల్లోనూ పర్యటించనున్నారు. కూటమి బహిరంగ సభలు, రోడ్ షోల్లో పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఎక్కువగా కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పవన్ పాల్గొనే అవకాశాలున్నాయి. కాపు సామాజిక వర్గం ఓటుబ్యాంకు అధికంగా ఉండే జిల్లాలు కావడమే దీనికి ప్రధాన కారణంగా పార్టీ నేతలు చెబుతున్నారు.

**ఆరు వరాలతో ఆకట్టుకునే యత్నం..**

పిఠాపురంలో ప్రచారానికి శ్రీకారం చుట్టడానికి ముందే పవన్ కల్యాణ్ ఆ నియోజకవర్గంపై వరాలను కురిపిస్తున్నారు. శాసన సభ్యుడిగా తనను ఎన్నుకుంటే ఎలాంటి అభివృద్ధి పనులను చేపడతాననేది ప్రకటించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే వాటిని నెరవేర్చేలా కృషి చేస్తానని అన్నారు. ఈ క్రమంలో ఆరు హామీలను పిఠాపురం ఓటర్లకు వరంగా ఇవ్వబోతున్నారు.

యువత సహా అర్హులైన వారందరికీ ఉద్యోగ అవకాశాల కల్పన
చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడం
ఆధ్యాత్మిక కేంద్రంగా పిఠాపురాన్ని అభివృద్ధి
పర్యాటక కేంద్రంగానూ అభివృద్ధి పర్చడం
ఇక్కడి మత్స్యకారులకు ప్రత్యేకంగా జెట్టీల నిర్మాణాన్ని చేపట్టడం
కోస్టల్ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి సారించడం- అనే ఆరు హామీలను పవన్ కల్యాణ్ ప్రకటించారు.

ఇది తామిచ్చే వాగ్దానమని, తనను గెలిపించుకోవడం పిఠాపురం ప్రజల బాధ్యత అంటూ కొత్త స్లోగన్‌ను పవన్ కల్యాణ్ తీసుకొచ్చారు. ఇవే హామీలు, ఇదే నినాదంతో పిఠాపురం ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని జనసేన పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దళిత జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షుని ఎన్నిక 'పిడిఏ'
# సమష్టి విజయం



లక్నో : జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) అధ్యక్షుని ఎన్నిక వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీల సమష్టి విజయం అని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మంగళవారం వ్యాఖ్యానించారు. 'పిడిఏ సమైక్యత జెఎన్‌యు విద్యార్థి సంఘం ఎన్నికలలో ముఖ్యమైన పదవులు అన్నీ గెలుచుకుని, బిజెపి మద్దతు ఉన్న ఎబివిపిని భారీ తేడాతో ఓడించింది' అని అఖిలేశ్ యాదవ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'పిచ్ఛదే' (వెనుకబడిన తరగతులు), దళిత్, 'అల్పసంఖ్యాక్' (మైనారిటీలు) అనే పదాలకు ఆయన 'పిడిఏ' అని సంక్షిప్త నామం సూచించారు. జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలో యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్ మొత్తం అన్ని పదవులనూ కైవసం చేసుకున్నది. అది తన సమీప ప్రత్యర్థి ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధిత ఎబివిపిని ఓడించింది. సుమారు మూడు దశాబ్దాల తరువాత లెఫ్ట్ మద్దతు ఉన్న వర్గాల నుంచి తమ తొలి దళిత అధ్యక్షుడు ధనంజయ్‌ను జెఎన్‌యుఎస్‌యు ఎన్నుకున్నది.

## ఇడి కస్టడీలో నుంచి రెండో సారి
# కేజ్రీ ఆదేశాలు



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీలో నుంచి రెండవ సారి ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్‌లలో ప్రజలకు మందులు, పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని కేజ్రీవాల్ ఆదేశించినట్లు ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భారద్వాజ్ మంగళవారం వెల్లడించారు. మొహల్లా క్లినిక్‌లలో అందుబాటులో ఉన్న లేబరేటరీ పరీక్షలలో సమస్యల గురించి కేజ్రీవాల్‌కు సమాచారం అందిందని, అందుకే ఆయన ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారని భారద్వాజ్ విలేకరుల గోష్ఠిలో చెప్పారు. ఆ సమస్యల పరిష్కారానికి ఆరోగ్య శాఖ వెంటనే పూనుకుంటుందని ఆయన తెలియజేశారు. కస్టడీలో ఉన్నప్పటికీ ఢిల్లీ ప్రజల సంక్షేమం గురించి కేజ్రీవాల్ సదా ఆలోచిస్తుంటారనేందుకు ఆయన తాజా ఆదేశాలు నిదర్శనమని భారద్వాజ్ అన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఈ నెల 28 వరకు ఇడి కస్టడీలో ఉన్న ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్ నగరంలోని కొన్ని ప్రాంతాలలో నీటి సరఫరా, మురుగునీటి సమస్యలను పరిష్కరించవలసిందని జల వనరుల శాఖ మంత్రి ఆతిశీకి క్రితం వారం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం కోర్టు ఇడికి, కస్టడీ కాలంలో కేజ్రీవాల్‌కు జారీ చేసిన ఉత్తర్వుకు అనుగుణంగా తాజాగా జారీ చేస్తున్న ఆదేశాలు ఉన్నదీ లేనిదీ ఇడి పరిశీలిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

# తుక్కుగూడ సభ నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం



## సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు...

**హైదరాబాద్ మార్చి, 26 :** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 14 పార్లమెంట్ స్థానాలు గెలవాలనే పట్టుదలతో ఉన్నామన్నారు సీ.ఎం. క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందని చెప్పారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉందని.. అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో రంజిత్ రెడ్డి, మల్కాజిగిరిలో సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్‌లో దానం నాగేందర్‌ను అభ్యర్థులుగా పార్టీ ప్రకటించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు మన వంద రోజుల పరిపాలనకు రెఫరెండమ్‌గా నిలుస్తుందని.. అందుకే అత్యధిక ఎంపీ స్థానాలను గెలిచేలా శ్రమించాలని పార్టీ కార్యకర్తలకు సీఎం దిశానిర్దేశం చేశారు. చేవెళ్ల ఎంపీ నియోజకవర్గం కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనంలో సీఎం మాట్లాడారు. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలు గెలిచి తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞత చెప్పాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్లు ప్రధానిగా ఉన్న మోదీ ఏం చేశారు.? ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు.

# కడిగిన ముత్యం మాదిరిగా బయటకు వస్తా: ఎమ్మెల్సీ కవిత



ఢిల్లీ: తనపై పెట్టింది మనీలాండరింగ్ కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తనను తాత్కాలికంగా జైలుకు పంపొచ్చు కానీ, ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఈ కేసులో ఒక నిందితుడు ఇప్పటికే బిజెపిలో చేరారని, ఇంకొక్కరికి లోకసభ ఎన్నికలలో బిజెపి టికెట్ ఇచ్చిందని ఆమె తెలిపారు. ఇడి మంగళవారం తనను కోర్టులో హాజరుపర్చేందుకు తీసుకువచ్చిన సందర్భంగా కవిత మాట్లాడారు. అలాగే, మూడో నిందితుడు కేసు నుంచి బయటపడేందుకు రూ 50 కోట్లు ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో బిజెపికి అందజేశారని ఆరోపణలు చేశారు. తనపై చట్టవిరుద్ధంగా తప్పుడు కేసు బనాయించారని, న్యాయపోరాటం చేసి కడిగిన ముత్యం మాదిరిగా బయటకు వస్తానని కవిత స్పష్టం చేశారు. తాను కడిగిన ముత్యంలో బటయకు వస్తానని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తాత్కాలికంగా జైల్లో పెట్టొచ్చు కానీ.. తన ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయలేరని చెప్పారు. ఇది మనీ లాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసని విమర్శించారు.

## సంపాదకీయం

# ఎన్నికల వేసవి!

సార్వత్రిక ఎన్నికలకూ, నాలుగురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాబోయే వేసవికి ఎన్నికలవేడి కూడా తోడవుతోంది. అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, ఆధునిక సౌకర్యాలు అందివచ్చినప్పటికీ, దేశ తొలిసార్వత్రిక ఎన్నికల తరువాత మళ్ళీ అంతటి సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియలో దాదాపు 97కోట్ల మంది ఓటర్లు పాల్గొనబోతున్నారు. ఈ ప్రక్రియ నలభైనాలుగురోజులకు విస్తరించడం వెనుక పాలకపక్షం ప్రయోజనాల పరిరక్షణ ఉన్నదన్న విమర్శలూ వింటున్నాం. ఇక, ఎన్నికలతో ముడిపడిన మరో రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నప్పుడే ఈ షెడ్యూల్ కూడా విడుదలైంది. ఒకపక్క, ఎన్నికల బాండ్లలో రహస్యాన్ని విప్పే లక్ష్యంతో సుప్రీంకోర్టు అదేపనిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంటపడుతోంది. మరోవైపు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ 2029నుంచి జమిలికి పోవాల్సిందేనంటూ వందలపేజీల నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను, నిబద్ధతను అంచనావేసే, అనుమానించే కాలం ఇది. సుప్రీంకోర్టు స్ఫూర్తికి పూర్తిభిన్నం గా ఎన్నికల కమిషనర్లను ఎంపికచేసే కమిటీనుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, కేంద్రప్రభుత్వం ఆ స్థానంలో హోంమంత్రిని చేర్చుకొని, ప్రతిపక్షనాయకుడి మాట చెల్లుబాటు కాకుండా జాగ్రత్తపడింది. ఇక, పాలకులు గతంలో ఏరికోరి నియమించుకున్న అరుణ్‌గోయల్ ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు రాజీనామా చేశారన్నది ఓ బ్రహ్మరహస్యం. ప్రధాన ఎన్నికల కమిషనర్ తప్ప మిగతా రెండుస్థానాలు ఖాళీ కావడంతో, ఆ పోస్టుల భర్తీ జరిగిపోయింది, తన మార్గదర్శకాలకు భిన్నంగా జరిగిన ఆ నియామకాలను నిలువరించడానికి సర్వోన్నత న్యాయస్థానం కూడా ఉత్సాహపడలేదు. ఆ ఇద్దరు కమిషనర్ల నియామకం తీరును ప్రతిపక్షనాయకుడు అధిర్ రంజన్ 'రిగ్గింగ్'తో పోల్చిన విషయం తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్‌ను నెలలతరబడి సాగదీయడం వెనుక బీజేపీకి ప్రయోజనం కలిగించే ఉద్దేశం ఈసీకి ఉన్నదన్న విమర్శలు కొత్తవేమీ కావు. పశ్చిమబెంగాల్‌లో ఏడుదశల్లో ఎన్నికలు ఉండేలా షెడ్యూల్ రూపొందడం వెనుక ఏ అంశాలు పనిచేశాయో తెలియదు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడంతో పాటు, ప్రజలకు ఆ మేరకు నమ్మకాన్ని కలిగించాలి. హద్దులుదాటినవారు ఎంతటివారైనా విడిచిపెట్టకుండా, ఎన్నికలు సజావుగా జరిగేట్టు చూడాలి. అంత తొందర ఎందుకో తెలియదు కానీ, ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్దిరోజుల ముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ నేతృత్వంలోని కమిటీ జమిలి ఎన్నికలను బలంగా సమర్థిస్తూ నివేదికను సమర్పించింది. పదేళ్ళుగా పాలకులు కలగంటున్న 'ఒకే దేశం ఒకే ఎన్నిక'ను ఆచరణసాధ్యం చేయడానికి వీలుగా నివేదిక రూపొందింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేమారు నిర్వహించడం, మరో వందరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయడం, ఒకే ఓటర్లజాబితా, ఒకే ఐడెంటిటీ కార్డు ఇత్యాదివి అనేకం అందులో ఉన్నాయి. జమిలి ఎన్నికలతో కాలమూ ఖర్చూ కలిసొస్తాయని బీజేపీ ఎప్పటినుంచో అంటోంది. గత ఎన్నికల మానిఫెస్టోలో దానిని తన ఎజెండాగా ప్రకటించింది. 47 రాజకీయపక్షాలు తమ అభిప్రాయాన్ని తెలియచేశాయని, వాటిలో 32 పార్టీలు జమిలికి అనుకూలంగా ఉన్నాయని కోవింద్ అంటున్నారు. ఏకాభిప్రాయంతోనే జమిలిని సుసాధ్యం చేస్తానని బీజేపీ హామీ ఇస్తున్నది కానీ, ఈ మారు అధికారంలోకి వస్తే ఏ విధంగానైనా దానిని ఆచరణలోకి తెస్తుందన్నది నిర్వివాదాంశం. ఏ ఎన్నికల విధానం ద్వారా ప్రజల ఆకాంక్షలకు, మనోభావాలకు ప్రాధాన్యం దక్కుతుందో దానిని ఆచరించడం ముఖ్యం కానీ, ఆర్థికమో, సౌలభ్యమో ప్రాతిపదికలు కాకూడదు. పార్లమెంటు ఎన్నికల్లోనూ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు వేర్వేరు అంశాల ఆధారంగా ఓటుచేస్తారు. జమిలి వల్ల రాష్ట్ర, స్థానిక అంశాలు వెనక్కుపోయి జాతీయ ప్రాధాన్యాల ఆధారంగా ఓటింగ్ జరుగుతుందన్నది వాస్తవం. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఢిల్లీలోని అన్ని స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటే, ఆ మరుసటి ఏడాదిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ అద్భుతమైన విజయాలు సాధించిన విషయం తెలిసిందే. జమిలిలో జాతీయ అంశాలు కీలకమై, ప్రాంతీయపార్టీలకు నష్టం జరుగుతుంది కనుక, బీజేపీ ఈ విధానాన్ని రుద్దుతున్నదని విపక్షాలు అంటున్నాయి. మందబలంతో రాజ్యాంగసవరణలు చేసి, జమిలిని బలవంతంగా తేవడం కాక, సమాఖ్యస్ఫూర్తికి భిన్నమైన ఈ విధానంపై ముందుగా లోతైన చర్చలు జరగాలి. ఈ ప్రక్రియ నలభైనాలుగురోజులకు విస్తరించడం వెనుక పాలకపక్షం ప్రయోజనాల పరిరక్షణ ఉన్నదన్న విమర్శలూ వింటున్నాం. ఇక, ఎన్నికలతో ముడిపడిన మరో రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నప్పుడే ఈ షెడ్యూల్ కూడా విడుదలైంది. ఒకపక్క, ఎన్నికల బాండ్లలో రహస్యాన్ని విప్పే లక్ష్యంతో సుప్రీంకోర్టు అదేపనిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంటపడుతోంది.

# జైరామ్ రమేష్ వ్యాఖ్యలకు స్మృతి ఇరానీ కౌంటర్

న్యూఢిల్లీ: బీజేపీ ప్రభుత్వంలో మహిళల సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి



స్మృతి ఇరానీ మండిపడ్డారు. దీనికి సంబంధించి స్మృతి ఇరానీ సోషల్ మీడియా ఎక్స్‌లో ఒక పోస్ట్?ను చేశారు.

జైరామ్ రమేష్ చేసిన ఆరోపణలను లక్ష్యంగా చేసుకుని అతని పేరు ఎక్కడా ఉపయోగించకుండా కౌంటర్ చేశారు స్మృతి ఇరానీ. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలో జైరామ్ రమేష్‌ను గాంధీ కుటుంబానికి 'కోర్టియర్' అని అభివర్ణించారు.ఒక మూరు?డు మరొకరిని మోసం చేయడానికి ప్రయత్నిస్తే, అతను ఎంత పెద్ద మూరు?డో అర్థం చేసుకోవచ్చు అని దీనిపై జై రామ్ రమేష్ పేర్కొన్నారు.

చాలా కాలంగా, రాజవంశ పాలకులు వారి వారసులు దేశ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు స్మృతి ఇరానీ. ఇప్పుడు అదే పాలకులకు చెందిన వ్యక్తులు కొందరు మహిళా సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని నిర్వీర్యం చేసే పనిలో పడ్డారని పేర్కొన్నారు. అందులో భాగంగా లెక్కలను తారుమారు చేస్తూ వాస్తవాలు చెప్పకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మేధోవాదం ముసుగులో మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి పాత్రను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో అవమానకరంగా వివరిస్తున్నారని కేంద్ర మంత్రి రాశారు. ముఖ్యంగా మహిళా శక్తి కోసం బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ముఖ్యమైన విధానాలను, పథకాలను గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఏమన్నారు?**

ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నేత జైరాం రమేష్ బీజేపీ ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు సంధించారు. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గత పదేళ్లలో చెప్పుకోదగ్గ, విజయవంతమైన పనులేవీ జరగలేదన్నారు. ఇది భారీ వైఫల్యాలతో కూడిన దశాబ్దంగా ఆయన అభివర్ణించారు. దీనితో పాటు, 2024 జూన్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'మహిళలకు 10 ఏళ్ల అన్యాయం' జరిగిన శకం ముగుస్తుందని జైరాం రమేష్ అన్నారు. పదేళ్లుగా మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ అసమర్థత, ఉదాసీనత, మహిళా వ్యతిరేక మనస్తత్వం మాత్రమే చూస్తోందని ఆయన బిజెపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

## కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా

# కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరెస్టు వ్యవహారాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామన్న అమెరికా, ఈ కేసులో పారదర్శక విచారణ జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ అరెస్టుకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్నామని, సమయానుకూల పారదర్శక న్యాయ ప్రక్రియ జరుగుతుందని భావిస్తున్నామని అమెరికాకు చెందిన ఓ అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ అరెస్టుపై ఇటీవల జర్మనీ స్పందించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ముఖ్యమంత్రి నిష్పాక్షికమైన న్యాయవిచారణకు అర్హులనీ, చట్టపరంగా అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ ఆయన వినియోగించుకోవచ్చునని జర్మనీ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఒకరు ఇటీవల ప్రకటన విడుదల చేయగా దీనిపై భారత్ మండిపడింది. ఇది తమ అంతర్గత వ్యవహారాలలో జోక్యం



చేసుకోవడమేనంటూ నిరసన వ్యక్తం చేసింది. తాజాగా అమెరికా కూడా జర్మనీ తరహాలోనే వ్యాఖ్యానించిన నేపథ్యంలో భారత్ స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

# భోజ్‌శాలలో హిందువుల ప్రార్థనలు



ధార్ : మధ్య ప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల/ కమాల్ మౌలా మసీదు సముదాయంలో మంగళవారం హిందువులు ప్రార్థనలు చేశారు. మరొక వైపు ఆ సముదాయంలో భారత పురావస్తు సర్వే సంస్థ(ఎఎస్ఐ) కోర్టు ఆదేశిత సర్వేను కొనసాగించింది. 2003 ఏప్రిల్ 7 నాటి ఎఎస్ఐ ఉత్తర్వు ప్రకారం, ప్రతి మంగళవారం భోజ్‌శాల సముదాయం లోపల పార్థనలకు హిందువులను అనుమతిస్తున్నారు. ప్రతి శుక్రవారం ఆ ప్రదేశంలో నమాజ్‌కు ముస్లింలను అనుమతిస్తున్నారు. ఎఎస్ఐ సర్వే ప్రారంభం కావడానికి ముందే ఉదయం సుమారు 7.15 గంటలకు హిందు భక్తులు ఆ చారిత్రక సముదాయానికి చేరుకున్నారు. భోజ్‌శాల సముదాయంలో 'శాస్త్రీయ సర్వే'ను ఆరు వారాలలోగా నిర్వహించాలని ఎఎస్ఐని మధ్య ప్రదేశ్ హైకోర్టు ఈ నెల 11న ఆదేశించింది. ఎఎస్ఐ సర్వే ఈ వివాదానికి మెరుగైన పరిష్కారం తీసుకువస్తుందని భోజ్ ఉత్సవ్‌సమితి ఉపాధ్యక్షుడు బాల్‌వీర్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంజాబ్‌లో బిజెపి ఒంటరి పోరు

చండీగఢ్: శిరోమణి అకాలీదళ్(ఎస్ఎడి)తో తమ పొత్తు చర్చలు విఫలమయ్యాయని సూచనప్రాయంగా తెలియచేస్తూ పంజాబ్‌లోని రానున్న లోక్‌సభ ఎన్నికలలో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి మంగళవారం ప్రకటించింది. బిజెపి ఒంటరి పోరుతో రాష్ట్రంలో చతుర్ముఖ పోటీ అనివార్యంగా కనపడుతోంది. పంజాబ్‌లోని 13 లోక్‌సభ నియోజకవర్గాలకు జూన్ 1న పోలింగ్ జరగనున్నది. మొత్తం అన్ని లోక్‌సభ స్థానాలలో ఒంటరిగా పోటీ చేస్తామని పంజాబ్ బిజెపి అధ్యక్షుడు సునీల్ జాకఢ్ మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రకటించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకు తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పంజాబ్ భవిష్యత్తు కోసం, యువజనులు, రైతులు, వ్యాపారులు, కార్మికులు, అణగారిన వర్గాల కోసం తీ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.జ పంజాబ్ ప్రజలు తమ పార్టీకి భారీ విజయాన్ని అందచేస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. 1996లో బిజెపితో పొత్తు కుదుర్చుకున్న ఎస్ఎడి 2019 లోక్‌సభ ఎన్నికలలో కూటమి చెరో రెండు స్థానాలలో విజయం సాధించింది. వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ 2020 సెప్టెంబర్‌లో బిజెపితో సంబంధాలు తెగతెంపులు చేసుకుంది.

## మమత కుటుంబ మూలాలపై...

# వివాదాస్పద వ్యాఖ్యలు

కోల్‌కత: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కుటుంబ నేపథ్యంపై బిజెపి సీనియర్ నాయకుడు, ఎంపి దిలీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలు పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలపై అధికార టిఎంసి మండిపడింది. బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలు కాషాయ పార్టీ డిఎన్ఎని ప్రతిబింబిస్తున్నాయని టిఎంసి విమర్శించింది. దిలీప్ ఘోష్ చేసినట్లు చెబుతున్న వ్యాఖ్యల వీడియోను టిఎంసి సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీదీ(మమతా బెనర్జీ) గోవాకు వెళ్లినపుడు తనను తాను గోవా బిడ్డనని చెప్పుకుంటారు. త్రిపురకు వెళ్లినపుడు త్రిపుర బిడ్డనని చెప్పుకుంటారు. తన తండ్రి ఎవరో ముందు ఆమె గుర్తించాలి అంటూ ఘోష్ ఆ వీడియోలో వ్యాఖ్యానించడం వినిపించింది. మెడినిపూర్ లోక్ సిట్టింగ్ ఎంపిగా ఉన్న దిలీప్ ఘోష్ రానున్న ఎన్నికలలో బర్ధమాన్-దుర్గాపూర్ లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టిఎంసి ప్రచారం చేసిన నినాదం బంగ్లా నిజెర్ మెయెకీ చాయ్(బెంగాల్ సొంత కుమార్తెను కోరుకుంటోంది)ని ప్రస్తావిస్తూ ఘోష్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఘోష్ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని టిఎంసి నిర్ణయించింది. మమతపై



తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఘోష్ క్షమాపణ చెప్పాలని పశ్చిమ బెంగాల్ మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శశి పంజా డిమాండ్ చేశారు. ఘోష్ వ్యాఖ్యలు బిజెపి డిఎన్ఎని ప్రతిబింబిస్తున్నాయని ఆమె చెప్పారు. దీనిపై ఇసి స్పందించాలి ఆమె కోరారు. బెంగాలీ మహిళలంటే ఘోష్‌కు గౌరవం లేదని, హిందూమతానికి చెందిన దేవతలన్నా, భారతదేశంలోని ఏకైక మహిళా ముఖ్యమంత్రి అన్నా ఆయనకు కొద్దిపాటి గౌరవం కూడా లేదని ఆమె విమర్శించారు.

# అడుగంటిన కృష్ణమ్మ..!

## ఇక తెలుగు ప్రజలకు కడగల్లే.. డెడ్ స్టోరేజికి శ్రీశైలం జలాశయం.. కారణం ఇదేనట..!



నంద్యాల జిల్లా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగు త్రాగునీరందించే శ్రీశైలం జలాశయం.. ఇప్పుడు నీటి నిల్వలు తగ్గిపోయి వెలవెలబోతుంది. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు తెలుగు రాష్ట్రాలకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా, ప్రభుత్వాలు మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరించడమే ఇందుకు కారణం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అవసరం 215 టీఎంసీలకు గాను.. ఇప్పుడు మిగిలింది 34 టీఎంసీలే పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేయడం జలాశయంలో నిటి నిల్వలు తగ్గిపోయాయి. కేఆర్ఎంబీ విజ్ఞప్తులను రెండు రాష్ట్రాలు పట్టించుకోలేదు. అవసరం లేకున్నా విద్యుదుత్పత్తి చేయడమే శ్రీశైలం జలాశయం డెడ్ స్టోరేజికి కారణం అంటున్నారు అధికారులు. డెడ్ స్టోరేజీకి చేరువలో శ్రీశైలం జలాశయం చేరుకుంది. డ్యామ్ లో నిటినిల్వలు తగ్గిపోయాయి. ఇక ఈ ఎండాకాలం సీజన్ లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇందుకు కారణం ఇరు తెలుగు రాష్టాలు పోటాపోటీగా జలవిద్యుదుత్పత్తి చేయడమే. గత వర్షాకాలంలో సీజన్ లో నిండుకుండలా శ్రీశైలం జలాశయం నిండుకుంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీల సామర్థ్యానికి గాను..ఇప్పుడు 34 టీఎంసీల డెడ్ స్టోరేజీ స్థాయికి నీటి నిల్వలు అడుగంటిపోయాయి. తాగు, సాగునీటి అవసరాలున్నప్పుడు మాత్రమే జలవిద్యుత్తును ఉత్పత్తి చేయండి. అనవసరంగా విద్యుదుత్పత్తి వద్దు" అంటూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ ఎంబీ) చేసిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసి.... ఇరు తెలుగు రాష్ట్రాలు పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను ముందే ఊహించిన కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాలను హెచ్చరిస్తూ పలుమార్లు లేఖలు రాసింది. చివరికి బతిమాలుతూ జలవిద్యుత్తును నిలిపివేయాలని కోరింది. తాగు, సాగు నీటి అవసరాల కోసం మాత్రమే జల విద్యుత్తు ఉత్పత్తి జరగాలి. కానీ, సాగు, తాగునీటి ఆవసరాలకు లేకుండా శ్రీశైలంలో జలవిద్యుత్తును ఉత్పత్తి చేయడంతో విలువైన నీరు దిగువకు వెళ్లిపోయింది. రానున్న రోజుల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. శ్రీశైలం జలాశయంలో గత ఏడాది మార్చి 26 ఇదే సమయానికి 809.60 అడుగులుగా 34.4273 టి.ఎం. సి. జలాశయంలో నీరు ఉంది. అయితే, ప్రస్తుతం ఇవాళ శ్రీశైలం జలాశయం నీటిమట్టం 810.70 అడుగులుగా ఉంది. శ్రీశైలం జలాశయం పూర్తీ స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 810. 70 అడుగులుగా ఉంది. పూర్తిస్దాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 34.6979 టీఎంసీలుగా నమోదైంది. అయితే శ్రీశైలం జలాశయం ప్రస్తుతం నీరులేక అడుగంటిపోయింది.

# అదిబాద్‌లో భగ్గుమన్న ఎండలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎండలు ముదురుతున్నాయి. మంగళవారం అదిలాబాద్ జిల్లా సాత్నాలలో 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40నుంచి 42డిగ్రీలకు పెరిగే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణలో ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నట్టు తెలిపింది. అదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ , నిజామాబాద్ , జగిత్యాల, పెద్దపల్లి ,కరీంనగర్ ,జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ , భద్రాద్రి కొత్తగూడెం ,సూర్యాపేట , నల్లగొండ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని, పగటి ఉష్ణోత్రలు గరిష్టంగా 42 డిగ్రీలకు చేరుకునే అవకాశాలు ఉన్నట్టు వెల్లడించింది.ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 41.1 డిగ్రీలు నమోదు కాగా, భద్రాద్రికొత్తగూడెం, కొమరంభీమ్ జిల్లాల్లో 40.8, అదిలాబాద్‌లో 40.7, నిజామబాద్‌లో 40.6, నిర్మల్‌లో 40.5, సూర్యాపేటలో 40.1డిగ్రీలు నమోదయ్యాయి. మహబూబ్ నగర్ , ఖమ్మం జిల్లాల్లో కూడా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# సుప్రీం తీర్పుతో వ్యవస్థలు మారేనా....?




ఈ దేశంలో వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించడం గురించి ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం చెప్పుకోదగ్గ విషయమే. చట్టసభల్లో ఓటు వేసేందుకు, ప్రసంగించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముడుపులు తీసుకుంటే వారిపై అవినీతి నిరోధక చట్టం క్రింద చర్యలు తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన తీర్పు వెలువడిన క్షణాల్లోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం ప్రకటించారు. ఈ తీర్పు రాజకీయాలను అవినీతి నుంచి ప్రక్షాళనం చేసేందుకు, వ్యవస్థలపై ప్రజలకు ప్రగాఢమైన నమ్మకాన్ని కలుగచేసేందుకు దారితీస్తుందని మోదీ అన్నారు. చట్టసభల్లో ఓటింగ్ చేసేందుకు సభ్యులు ముడుపులు తీసుకునే విషయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక మూడు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1993 జూలైలో పీవీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వామపక్షాలకు బీజేపీ కూడా మద్దతు నిచ్చింది. తమ మధ్య సైద్ధాంతిక విభేదాలు వారి లక్ష్యానికి అడ్డు రాలేదు. ప్రధానమంత్రి కావాలన్న ఆకాంక్షతో ఉన్న కాంగ్రెస్ నేత అర్జున్ సింగ్‌తో పాటు పలువురు పీవీ ప్రభుత్వం పడిపోయేందుకు తెరవెనుక తమ వంతు ప్రయత్నాలు చేశారు. అంతర్గత, బహిర్గత ప్రత్యర్థుల మధ్య చివరకు అవిశ్వాస తీర్మానం వీగిపోయి పీవీ ప్రభుత్వం 14 ఓట్లతో గట్టెక్కింది. జనతాదళ్ నుంచి రాంలఖన్ యాదవ్ నేతృత్వంలో విడిపోయిన ఏడుగురు సభ్యులతో పాటు నలుగురు జేఎంఎం సభ్యులు మద్దతు నిచ్చారు. ములాయం వర్గానికి చెందిన ముగ్గురు ఎంపీలు, బిఎస్‌పికి చెందిన ముగ్గురు ఎంపీలు గైరుహాజరయ్యారు. జనతాదళ్ (ఏ) నేత అజిత్‌సింగ్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. అజిత్‌సింగ్‌కు ఆ తర్వాత మంత్రిపదవి దక్కింది. నిజానికి జేఎంఎం సభ్యులు ఓటు వేయకపోయినా పీవీ ప్రభుత్వం గట్టెక్కేది. ఎందుకంటే, ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్‌లతో పాటు కాన్షీరామ్ కూడా పీవీకి మద్దతు నిచ్చారు. ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు పీవీ జవాబిస్తూ జార?ండ్ ప్రాంతానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో జేఎంఎం సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించారు. పీవీ హామీతోనే వారు సరిపెట్టుకుంటే బాగుండేది కాని ప్రభుత్వాన్ని కాపాడాలనుకున్న పి.వి. శ్రేయోభిలాషుల నుంచి ముడుపులను కూడా రాబట్టినట్లు ప్రచారం జరిగింది. 'వారికి ఒక్క పైసా కూడా ఇవ్వకండి అని ప్రధానమంత్రి చెప్పినప్పటికీ మా భయం మాది' అని పీవీ శ్రేయోభిలాషి ఒకరు వెల్లడించారు. పీవీ మూడు అవిశ్వాస తీర్మానాల నుంచి గట్టెక్కారు కాని ఏ సందర్భంలోనూ ఎంపీలను ప్రలోభపెట్టినట్లు ఆరోపణలు రాలేదు. జేఎంఎం ఎంపీలు పీవీ సర్కార్‌కు మద్దతు ప్రకటించిన తర్వాత దాదాపు మూడేళ్ల పాటు ఈ విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండగా, రాష్ట్రీయ ముక్తి మోర్చా అనే సంస్థకు చెందిన రవీంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేయడం, పీవీ 1996 మే 24న గద్దె దిగగానే జేఎంఎం కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశించిన అయిదు నెలల్లోనే సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసి పీవీని ఏ%--%వన్ నిందితుడుగా చేర్చడం, బీజేపీలో చేరిన జేఎంఎం సభ్యుడు శైలేంద్ర మహతో తనకు పీవీ ముడుపులు చెల్లించారని ఆరోపించి అప్రూవర్‌గా మారడం వంటి పరిణామాలు వెనువెంటనే జరిగాయి. దర్యాప్తు పూర్తిగా శైలేంద్ర మహతో ప్రకటనపై ఆధారపడి జరిగినట్లు, ఆయన రకరకాల ప్రకటనలు చేసినట్లు ఆనాటి ఉదంతాలు అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఇదే అభిప్రాయంతో అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోంధీ, పీవీని నిర్దోషిగా ప్రకటించారు. పీవీ నేరుగా ఎంపీలకు ముడుపులు ఇచ్చినట్లు ఎక్కడా రుజువులు లేవని ఆయన తన తీర్పులో ప్రకటించారు. హర్షద్ మెహతా అనే స్టాక్ బ్రోకర్ పీవీకి రూ. 1 కోటి చెల్లించినందువల్ల సీబీఐతో విచారణ జరిపించాలని జనహిత్ అనే సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు కూడా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఆ పిటిషన్‌ను కొట్టి వేశారు. సుప్రీంకోర్టును రాజకీయాలకు వేదిక చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. పీవీపై వచ్చిన అనేక ఆరోపణలు, కేసుల నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డప్పటికీ, వాటి వెనుక రాజకీయ కుతంత్రాలు ఎన్ని ఉన్నప్పటికీ, జేఎంఎం కేసులో 1998లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ అవినీతికి సంబంధించి న్యాయవ్యవస్థ తీరుతెన్నులనే ప్రశ్నార్థకం చేసిందని చెప్పక తప్పదు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఎంపీలపై వచ్చిన అవినీతి నేరారోపణలపై రాజ్యాంగంలోని అధికరణ 105(2) ప్రకారం చర్యలు తీసుకోవడానికి వీలు లేదని సుప్రీంకోర్టు భావించింది. సభ్యులు పార్లమెంట్‌లో చేసిన పనులన్నీ ఈ అధికరణ క్రింద వస్తాయని ప్రముఖ న్యాయవాది పావని పరమేశ్వరరావు చేసిన వాదనను సుప్రీం మెజారిటీ బెంచ్ ఆమోదించింది. ఎంపీలు స్వేచ్ఛగా వ్యవహరించేందుకు వీలుగా రూపొందించిన ఈ అధికరణను పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలకూ, ఓటింగ్‌కూ వర్తింపచేయవచ్చు కాని ముడుపులు స్వీకరించినా, ఘోరమైన నేరాలకు పాల్పడినా వర్తింపచేయడం సరైనదేనా అన్న ప్రశ్నలకు జవాబు లేకపోవడంతో నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా నిలిచింది. దాదాపు 26 సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు మళ్లీ తన తీర్పును తానే తిరగరాయడం చరిత్రాత్మకం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఇదే ఉద్దేశంతో సుప్రీం తాజా తీర్పును స్వాగతించి ఉంటారు. కాని సరిగ్గా 20 రోజుల క్రితం ఇదే సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పేరుతో రాజకీయ పార్టీలు రహస్య విరాళాలు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అవి కూడా కార్పొరేట్ సంస్థల నుంచి ముడుపులు స్వీకరించడంతో సమానమని తీర్పు నిచ్చినప్పుడు మాత్రం ప్రధానమంత్రి ఏ మాత్రం స్పందించలేదు. బహుశా ఎన్నికల బాండ్ల విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పుతో ఆయన ఏకీభవించడం లేదని అనుకోవాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎన్నికల బాండ్ల వివరాలు చెప్పేందుకు కూడా స్టేట్ బ్యాంక్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ సమయం అడగడం ప్రభుత్వ పారదర్శకతపై అనేక సందేహాలకు తావునిస్తోంది. చట్టసభల్లో ముడుపులు తీసుకోవడం తప్పు అని సుప్రీంకోర్టు ప్రకటించింది కాని చట్టసభల బయట ఏ విధంగా ముడుపులు తీసుకున్నా తప్పేమి కాదని ఈ దేశంలో నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది. సుప్రీంకోర్టు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఈ దేశంలో ప్రజాప్రతినిధులు తమను తాము అమ్ముకోవడం, వారిని కొనుగోలు చేయడం మాత్రం ఆగిపోవడంలేదు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి వేరే పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించారు. 'ఎన్ని ఫిరాయింపు వ్యతిరేక చట్టాలు చేసినా ఎమ్మెల్యేలు ఇలా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో చీకటి కోణాన్ని చూపిస్తోంది. రాజకీయాల్లో నైతికత అనేది ఉంటే క్రాస్ ఓటింగ్ అనేదే జరగదు' అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఖురేషీ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఏదో విధంగా మెజారిటీ సంపాదించేందుకు, హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు, లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ఈ క్రాస్ ఓటింగ్‌కు పకడ్బందీగా వ్యూహరచన చేసి ఉండవచ్చు. కాని ఏ ప్రలోభాలు లేకుండా, ఏ ముడుపులు చెల్లించకుండా ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారా అన్న ప్రశ్న ప్రతి ఒక్కరి మనసుల్లో తలెత్తుతుంది. పీవీ నరసింహారావు సమయంలో నలుగురు జేఎంఎం ఎంపీలు ఓటు వేసినందుకు సీబీఐ విచారణకు ఆదేశించినట్లే, ఈ క్రాస్ ఓటింగ్‌పై కోర్టులు కానీ, ప్రభుత్వం కానీ సీబీఐ విచారణకు ఆదేశించగలవా? ఎమ్మెల్యేలు ముడుపులు స్వీకరించలేదని కోర్టు ద్వారా నిర్ధారించగలదా? రాజ్యసభ ఎన్నికల విషయంలోనే కాదు, గత పది సంవత్సరాలుగా 'ఆపరేషన్ లోటస్' వ్యూహంలో భాగంగా ఎమ్మెల్యేలు ఏదో విధంగా పార్టీ మారుతూనే ఉన్నారు.

## దర్శి టిడిపిలో రోజుకో ట్విస్ట్.. అభ్యర్థి ఎంపికపై వీడని చిక్కుముడి..




అమరావతి: దర్శిలో టిడిపి అభ్యర్థి ఎంపిక చిక్కుముడి ఇప్పట్లో వీడేలా కనిపించడంలేదు. ఒక ముడి విప్పేలోపే మరో చిక్కుముడి పడుతున్నట్టుగా తయారైంది పరిస్థితి. దర్శి నుంచి మాజీ మంత్రి, ప్రస్తుతం వైసిపిలో కొనసాగుతున్న శిద్దా రాఘవరావు పేరును ఎంపిక చేసేందుకు టిడిపి అధిష్టానం పరిశీలిస్తోంది.

దాదాపు శిద్దా రాఘవరావు పేరు ఖరారయ్యే చివరి నిమిషంలో సియం వైయస్ జగన్ నుంచి శిద్దాకు పిలుపువచ్చింది. పార్టీ మారే ఆలోచనలో ఉన్న శిద్దాను బుజ్జగించే పనిలో ఉంది వైసిపి అధిష్టానం. రానున్న ఎన్నికల్లో దర్శి వైసిపి టికెట్ ఆశించారు శిద్దా రాఘవరావు. అయితే అధిష్టానం పెద్దలు మాత్రం తొలుత అద్దంకి, ఆ తరువాత ఒంగోలు, అనంతరం మార్కాపురం నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని శిద్దాకు సూచించినట్లు తెలుస్తోంది.

శిద్దా మాత్రం తాను దర్శి నుంచే పోటీ చేస్తానని చెప్పడంతో ఆయనకు వైసిపి టికెట్ లభించలేదు. ఈ నేపథ్యంలో టిడిపిలో చేరి ప్రస్తుతానికి ఖాళీగాఉన్న దర్శి టిడిపి స్థానం నుంచి పోటీ చేయాలన్న ఒత్తిడి టిడిపి నుంచి ఎదురైంది. దర్శి నుంచి టిడిపి టికెట్‌పై పోటీ చేసేందుకు శిద్దా సమాయాత్తమయ్యేలోపే వైసిపి అధిష్టానం నుంచి శిద్దాకు పిలుపువచ్చిందట. సియం వైయస్ జగన్‌ను కలవాలని వైసిపి అధిష్టానం పెద్దలు శిద్దాకు సూచించినట్లు సమాచారం. దీంతో దర్శిలో టిడిపి టికెట్‌పై శిద్దా పోటీ చేసే విషయంలో సందిగ్ధత నెలకొంది. సియంతో తాజాగా భేటీ అనంతరం ఆయన ఏం మాట్లాడారో, ఎలాంటి నిర్ణయం తీసుకున్నారన్నది శిద్దా చెబితేకానీ తెలియని పరిస్థితి నెలకొంది. మరో రెండు రోజుల్లో శిద్దా రాఘవరావు టిడిపిలో చేరి దర్శి నుంచి పోటీ చేస్తారనుకుంటున్న తరుణంలో వైసిపి అధిష్టానం నుంచి పిలుపురావడంతో ఇక శిద్దా దర్శిలో టిడిపి నుంచి పోటీ చేయడం అనుమానమే అంటున్నారు.

**టిడిపి నుంచి నిన్నటి వరకు రేసులో మాజీ మంత్రి శిద్దా..**

దర్శి నియోజకవర్గంలో కమ్మ, యాదవ, కాపు సామాజికవర్గాల ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. 2014లో టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన శిద్దా రాఘవరావుకు జనసేన మద్దతు లభించడంతో కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా లభించాయి. దీంతో ఇక్కడ టిడిపి గెలుపుసాధ్యమైంది. ప్రస్తుతం కూడా ఇదే కాంబినేషన్‌లో బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పార్టీ తమ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని నిన్నటివరకు కోరింది. అయితే తాజాగా పొత్తుల్లో భాగంగా జనసేన దర్శి సీటును వదులుకోవాల్సి రావడంతో ఇక్కడ టిడిపి నేతలు పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. దీంతో ఇక్కడ టికెట్ కోసం టిడిపి నేతలు పోటీ పడుతున్నారు. వారిలో ప్రథమంగా ప్రస్తుతం వైసిపి పార్టీలో ఉన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పేరు ప్రముఖంగా వినిపించింది. శిద్దా రాఘవరావు 2014 ఎన్నికల్లో దర్శి నుంచి టిడిపి టికెట్‌పై పోటీ చేసి గెలుపొందారు.

చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవి చేపట్టి దర్శిలో ఎన్నడూ లేని విధంగా 3 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశారు. అయితే 2019 ఎన్నికల్లో అనూహ్యంగా శిద్దా రాఘవరావును టిడిపి అధిష్టానం ఒంగోలు పార్లమెంట్‌కు ఎంపి అభ్యర్థిగా పోటీ చేయించింది. ఎంపిగా పోటీ చేసి ఓడిపోయిన శిద్దా రాఘవరావు ఆ తరువాత అధికారపార్టీ వైసిపిలో చేరారు. 2024 ఎన్నికల్లో వైసిపి నుంచి దర్శి టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తాజాగా తిరిగి టిడిపి టికెట్‌పై దర్శి నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నించారు. అందుకు ప్రస్తుతం టిడిపి ఎంపి అభ్యర్థిగా పోటీ చేయనున్న మాగుంట రాఘవరెడ్డి కుటుంబం నుంచి కూడా దర్శి నుంచి శిద్దా అయితే బాగుంటుందని టిడిపి అధిష్టానానికి సూచించినట్టు వినికిడి. ఈ నేపథ్యంలో శిద్దా రాఘవరావు కూడా టిడిపిలో చేరి దర్శి నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే తాజాగా సీఎం జగన్ ను కలవడంతో పరిస్థితులు మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

## అతిసారతో బాధపడుతున్న వారిని పరామర్శించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర..



న్యూఢిల్లీ: అతిసార వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న హిరాకుడ్ ప్రాంత ప్రజలను కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కలిశారు. బుర్లలోని వీర్ సురేంద్ర సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (విమ్స్‌ఆర్)లో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం మంత్రి పరామర్శించారు. డయేరియాతో బాధపడుతున్న వారిని కలిసిన కేంద్ర మంత్రి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే మంత్రి ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా కేంద్ర మంత్రి పంచుకున్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి ట్వీట్ చేస్తూ.. 'నేను బుర్లలోని విమ్సార్‌లో డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న వారిని కలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నా. బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుల త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని రాసుకొచ్చారు.

## 'తడి' లేదు.. 'పొడి' లేదు...!



రంగారెడ్డి : గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేసేందుకు సంకల్పించింది. ఈమేరకు తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్‌ను అనుసంధానం చేసి వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 27 మండలాల్లో 558 గ్రామ పంచాయతీల్లో వీటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ఒక్కో కేంద్రానికి రూ. 2.50 లక్షలు వెచ్చించి గ్రామ శివార్లలో ఏర్పాటు చేశారు. అయితే, సరైన నిర్వహణ లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సేంద్రియ ఎరువు తయారీ నీరుగారుతోంది. సేంద్రియ ఎరువు తయారీకి తడి, పొడి చెత్తను వేరే చేసే కేంద్రాల (సెగ్రిగేషన్ షెడ్లు) నిర్మాణాలు పూర్తయ్యేంతవరకు హడావుడి చేసిన అధికార యంత్రాంగం.. అవి పూర్తయిన తర్వాత వాటి నిర్వహణ పూర్తిగా మర్చిపోయారు. సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేయాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు వృథాగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు సైతం అటువైపు దృష్టి సారించకపోవడంతో అసలు లక్ష్యం నెరవేరడం లేదు. తడి, పొడిచెత్తను వేరుచేయడం, సేంద్రియ ఎరువు తయారు చేయడం కోసం గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. తడి, పొడిచెత్తను వేరు చేయకుండానే కాల్చేస్తున్నారు. ఊరికి దగ్గర సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటుచేయడంతో.. అక్కడి నుంచి వెలువడే పొగతో చుట్టుపక్కల ప్రాంతాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ఈ విషయపై పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నిత్యం ట్రాక్టర్ల ద్వారా తడి, పొడిచెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే, ఎక్కువ శాతం పంచాయతీల్లోని కంపోస్టు షెడ్లలో వ్యర్థాలను వేరు చేసే పనులు జరగడం లేదు. వచ్చినది వచ్చినట్లే కుప్పగా ఒకేచోట పోయడంతో షెడ్లలో వేర్వేరు అవసరాల కోసం నిర్మించిన స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో తడి చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తుండగా.. పొడి చెత్తలో లభించే ప్లాస్టిక్, గాజు, ఇనుము, ఇతరత్రా వాటిని వేరు చేయడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. కేంద్రప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకాన్ని తీసుకొచ్చింది.

## నిఘా కట్టుదిట్టం....!



జగిత్యాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిఘాను కట్టు దిట్టం చేశారు. రాజకీయ పార్టీల కదలికలపై నిఘాను ఉంచారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా బహుమతలు తర లింపుపై 24 గంటల పాటు తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో ఆది నుంచి తుది వరకు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో రెవెన్యూ, ఎన్నికల అధికారుల పాత్ర కీలకంగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమ లు చేస్తూ అదుపుతప్పితే నియంత్రించాల్సిన విధి కూడా ఈ శాఖలకు చెం దిన అధికారులే ప్రధానంగా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు పలువురు ఎన్నికల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల అధికారులు, ఓటర్ల భద్రతకు సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్ పోలీస్ సీసీ కెమెరాలతో కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. తద్వారా బూత్ స్థాయిలో శాంతిభద్రతలపై ఎప్పటికప్పుడు నిర్దిష్ట అవగాహన ఏర్పడుతుంది. పోలింగ్ స్టేషన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయ డం, చట్టు పక్కల ప్రాంతాల్లో రాజకీయ, శాంతి భద్రతల పరిస్థితిని గమనిస్తుండడం వంటివి చేస్తున్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, శాంతి భద్రతల పరిరక్షణ, స్వే చ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూసేందుకు ఎన్నికల సంఘం సాంకేతికతకు పెద్ద పీట వేసింది.

# ఆప్‌కు కరువైన ప్రత్యామ్నాయాలు...!

ఆమ్‌ఆద్మీ పార్టీ చిక్కుల్లో పడింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంలో సీనియర్ నాయకులు ఒక్కొక్కరు జైలుకు వెళ్లడం.. మరో పక్క లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పార్టీ నాయకత్వ లోపాన్ని ఎదుర్కొంటోంది. పార్టీకి చెందిన కీలక నాయకులు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, ప్రస్తుతం ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌లు జైల్లో ఉన్నారు. మరి పార్టీని ముందుండి నడిపించేది ఎవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే కేజ్రీవాల్ వారసురాలిగా ఢిల్లీ విద్యాశాఖ మంత్రి అతిషిని తీర్చిదిద్దారన్న టాక్ వినిపిస్తోంది. ఆయన లేని సమయం లో ఢిల్లీ ప్రభుత్వం బాధ్యతలు ఆమె చూసుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక అసలు సవాలు విషయానికి వస్తే రాజకీయ నిర్ణయాలు ఎవరూ తీసుకుంటారు. పార్టీని ముందుండి నడిపించేది ఎవరూ అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆమ్‌ఆద్మీ పార్టీని ముందుండి నడిపించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ప్రస్తుతం పార్టీ సీనియర్ నాయకులు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్, కుమార్ విశ్వాస్ లాంటి వారు లేరు. దీంతో పార్టీలో కీలక నిర్ణయాలు ఎవరూ తీసుకోవాలో అర్థం కాని పరిస్థితి. ఆమ్‌ఆద్మీ పార్టీని 26 నవంబర్ 2012లో అధికారికంగా ప్రారంభించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పార్టీలో కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలు చాలా చురుకుగా పని చేస్తూ వచ్చారు. బహిరంగసభలో కేజ్రీవాల్ పార్టీ పేరున ప్రకటించారు. దీర్ఘకాలంగా కేజ్రీవాల్ వెంటే ఉన్న సిసోడియాను ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేజ్రీవాల్ డిప్యూటీ సీఎంగా నియమించారు. ప్రస్తుతం సంజయ్ సింగ్ రాజ్యసభ ఎంపిగా రెండో టర్మ్ కొనసాగుతున్నారు. రాజ్యసభలో సింగ్ ఆప్ పార్టీ తరపున తన గొంతును బలంగా వినిపిస్తున్నారు. అదే కాకుండా పార్టీ వ్యవస్థాపకుల్లో సింగ్ కూడా ఒకరు. ఇక సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌కు చెందినవారు. ఆయనకు వివిధ పార్టీలతో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలతో ఆప్ సంబంధాలు మరింత బలపడేందుకు కృషి చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. దీంతో సహజంగానే ఇక పార్టీకి ఎవరు నాయకత్వం వహిస్తారు అనే ప్రశ్న తెరపైకి వస్తుంది. ఇదే ఎక్సైజ్ పాలసీకి సంబంధించి మనీష్ సిసోడియా సుమారు ఏడాది కాలం నుంచి ఆయన జైల్లో ఉన్నారు. ఇదే కేసుకు సంబంధించి రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్‌ను ఇడి అక్టోబర్ 2023లో అరెస్టు చేసి జైలుకు పంపించింది. ఇక పార్టీలో ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్ కానీ ప్రస్తుతం ఆప్ పార్టీలో లేరు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని చెప్పి వారిని పార్టీ నుంచి బహిష్కరించారు. ప్రస్తుతం కుమార్ విశ్వాస్‌ను తీసుకుంటే కేజ్రీవాల్‌ను ఆయన తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పార్టీలో సీనియర్లు లేనందు వల్ల కేజ్రీవాల్ గైర్హాజరీలో పార్టీని ముందుండి నడపించేదెవరు అనే ప్రశ్నతలెత్తుతోంది. ఇక సిసోడియా విషయానికి వస్తే ఆయన అరెస్టు అయిన రెండు రోజుల తర్వాత డిప్యూటీ సిఎం పదవికి రాజీనామా చేశారు. ఎందుకంటే సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఆప్‌పార్టీకి చెందిన మరో మంత్రి సత్యేంద్ర జైన్‌ను తీసుకుంటే ఆయనను వేరే కేసు మనీలాండరింగ్ కేసులో మే 2022లో అరెస్టు చేయడంతో ఆయన అదే రోజు రాజీనామా చేశారు. ఇక గోపాల్ రాయ్ విషయానికి వస్తే ఆయన ఆప్‌పార్టీ ఢిల్లీ చీఫ్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం పరిస్థితులు చూస్తే కేజ్రీవాల్ తన వారసురాలిగా అతిషీని తీర్చిదిద్దారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తే అతిషికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న టాక్‌వినిపిస్తోంది. గురువారం రాత్రి కేజ్రీవాల్ అరెస్టు తర్వాత అతిషి, భరద్వాజలు ఇడి అరెస్టుకు నిరసనగా పెద్ద ఎత్తు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఆప్ నాయకులు మాత్రం కేజ్రీవాల్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడుపుతారని చెబుతున్నారు. ఫైల్స్‌ను జైలుకే తీసుకువెళ్తామంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారా లేదా అనేది పక్కనపెడితే.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కీలక నిర్ణయాలు ఎవరూ తీసుకోవాలనేది అసలు ప్రశ్న. ఇప్పటి వరకు ఆప్ పార్టీలో వన్‌మెన్ షో నడిచింది. గత కొన్ని సంవత్సరాల నుంచి పార్టీలో అరవింద్ కేజ్రీవాల్ మాటే చెల్లుబాటు అయింది. పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి తొమ్మిది మంది సభ్యులతో రాజకీయ వ్యవహారాల కమిటీ పిఎసి ఉంది. తొమ్మిది మందిలో సిసోడియా, సింగ్‌లు జైల్లో ఉన్నారు. ప్రస్తుతం కేజ్రీవాల్ ఇడి కస్టడీలో ఉన్నారు. మిగిలిన వారు అతిషి, రాఘవ్‌చద్దా, దుర్గేష్ పాఠక్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, రాఖి బిర్లా, పంకజ్ గుప్తా, ఎన్‌డీ గుప్తాలు మాత్రం ప్రస్తుతం పిఎసిలో సభ్యులుగా ఉన్నారు. ఆప్ నేషనల్ సెక్రటరీ సందీప్ పాథక్ విషయానికి వస్తే ఆయన పార్టీని ఇతర రాష్ట్రాల్లో ఎలా విస్తరించాలో వ్యూహ రచన చేస్తుంటారు. మొత్తానికి చూస్తే ఆప్ పార్టీలో నాయకులు ఉన్నా వారికి ఇచ్చిన బాధ్యతలు నేరవేర్చడంలో బిజీబిజీగా ఉన్నారు. అయితే పార్టీని కేజ్రీవాల్ మాదిరిగా ముందుండి నడిపించే నాయకుడు లేకుండా పోయారు. అయితే పార్టీ నాయకులు మాత్రం ఇప్పటి నుంచే కలవరపడాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. అందరం సమిష్టిగా కలిసి పార్టీని నడుపుతామని చెబుతున్నారు. తమ నాయకుడు జైల్లో ఉన్నా ఆయన మాతోనే ఉంటారు. ఆయనే పార్టీని నడుపుతారు అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఢిల్లీ మంత్రి ఒకరు చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని ఎవరూ ముందుండి నడిపిస్తారో వేచి చూడాల్సిందే.

# గాజా 'పీడకల'కు ముగింపు పలకాలి



**రఫా :** ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ విధ్వంసానికి గురైన గాజా గుమ్మం వద్దకు వెళ్లి, రక్తపాతాన్ని ఆపాలని, భయానక క్షామం వైపు నెట్టబడుతున్న గాజాకు మానవతా సహాయాన్ని అందించేందుకు వీలుగా తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. రఫా పట్టణం ఈజిప్షియన్ వైపు క్రాసింగ్ వద్ద ఆయన శనివారం మట్లాడుతూ రఫా పై భూతల దాడులకు ఇజ్రాయిల్ చేస్తున్న యత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనీయులు ఎక్కువ మంది రఫాలో ఆశ్రయం పొందుతున్నారు. గుటెరస,, ఇతర ప్రపంచ నాయకుల విజ్ఞప్తిని బేఖాతరు చేస్తూ గాజాను నామరూపాల్లేకుండా చేయాలని ఇజ్రాయిల్ చూస్తున్నది. 'గాజాలోని పాలస్తీనియన్లు ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు అత్యంత దారుణమైన స్థితిని ఎదుర్కొంటున్నారని గుటెర్రెస్ పేర్కొన్నారు. "ఏదైనా తదుపరి దాడి పరిస్థితిని మరింత దిగజార్చుతుంది."దాదాపు ఆరు నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న బాంబు దాడుల్లో 32 వేల మందికిపైగా మరణించారు. గాజ నేడు తీవ్ర మానవీయ్ష సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని గుటెరస్ హెచ్చరించినప్పటికీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం దాడులతో ముందుకెళ్తామని హూంకరిస్తు న్నారు. .రఫాపై భూతల దాడులకు అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే గాజాలోని పెద్ద భూభాగం శిథిలావస్థకు చేరుకుంది "గాజాలో ఆకలితో ప్రజలు పెద్దయెత్తున చనిపోతున్నారని" ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యు ఎఫ్ ఓ) ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది.

# 31న ఇండియా ఫోరం మెగా ర్యాలీ




న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల ఐక్యత, బలం బలోపేతం లక్ష్యంతో ఇండియా ఫోరం 31న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 'మహా ర్యాలీ' నిర్వహించనుంది. ప్రతిపక్షాలపై కేంద్రం దాడికి వ్యతిరేకంగా, కేజ్రీవాల్‌కు మద్దతుగా ఈ ర్యాలీలో ఇండియా ఫోరం జాతీయ నేతలు పాల్గొన్నారు. ఈ మేరకు ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆప్ మంత్రులు గోపాల్ రారు, అతిషి, సౌరభ్ భరద్వాజ్, ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అరవిందర్ సింగ్ లవ్లీ, సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాజీవ్ కున్వార్ మాట్లాడారు.

తొలుత ఢిల్లీ మంత్రి గోపాల్ రారు మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, 31 ఉదయం 10 గంటలకు జరిపే ర్యాలీలో పాల్గొనాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోడీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన తీరును దేశ వ్యాప్తంగా రాజ్యాంగాన్ని ప్రేమించే, గౌరవించే వారందరూ వ్యతిరేకిస్తున్నారు. ఇది కేవలం కేజ్రీవాల్ గురించి మాత్రమే కాదు. మొత్తం ప్రతిపక్షాన్ని తుడిచిపెట్టడానికి మోడీ కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారు. అమ్ముడుపోవడానికి, తలవంచడానికి సిద్ధంగా లేని వారిపై కేసులు నమోదు చేసి.. జైళ్లో వేస్తున్నారు. ఈ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడానికి, విస్తరించడానికి రాంలీలా మైదాన్‌లో ర్యాలీ నిర్వహించనున్నాం. ఇది ఇండియా ఫోరం మహా ర్యాలీ అవుతుంది. ఢిల్లీ ప్రజలే కాదు దేశ ప్రజలందరూ.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే వారు రాంలీలా మైదానానికి రావాలని విన్నవిస్తున్నాం"అని అన్నారు.

# జైలు నుంచే కేజ్రీవాల్ పాలన.....!




**న్యూఢిల్లీ :** ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పరిపాలన ప్రారంభించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఎదురువుతున్న నీటి, మురుగు నీటి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని నీటి పారుదాల శాఖ మంత్రి అతిషిని ఆదేశిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. నుంచి క్రేజీవాల్ విడుదల చేసిన తొలి ఉత్తర్వులు ఇవే. శనివారం అర్ధరాత్రి తరువాత ఈ ఆదేశాలు తమకు అందినట్లు ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రి అతిషి తెలిపారు. జైలులో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలపై శ్రద్ధ చూపడం తనకు కన్నీళ్లు తెప్పించిందని ఆమె చెప్పారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి సరఫరాను పటిష్టం చేయాలని, నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు తగినన్ని నీటి ట్యాంకర్లను తరలించాలని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కేజ్రీవాల్ నిర్దేశించారని చెప్పారు. అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా సహాయాన్ని కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని, లెఫ్టినెంట్ గవర్నర్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నట్లు మంత్రి అతిషి తెలిపారు.

# బ్రెజిల్‌లో తుపాను బీభత్సం..!



**రియోడిజెనెరియో :** బ్రెజిల్‌లో తుపాను బీభత్సానికి పలువురు మృతి చెందారు. ఎడతెరిపిలేకుండా కురుస్తోన్న వర్షాలకు బ్రెజిల్ అతలాకుతలమవుతోంది. రియోడిజెనెరియో రాష్ట్రంలోని పర్వత ప్రాంతాల్లో తుపాను తీవ్రతకు 10మంది చనిపోయారు. వర్షం ధాటికి పెట్రోపోలిస్ పట్టణంలోని ఓ ఇళ్లు కూలిపోవడంతో నలుగురు మృతి చెందారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన ఒక బాలికను రెస్క్యూ సిబ్బంది కాపాడారు. అదే ప్రాంతంలో బాలిక తండ్రి మృతదేహాన్ని కనుగొన్నారు. సాంటా క్రుజ్ ద సెర్రాలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందారు. రియోడిజెనెరియో గవర్నర్ క్యాస్టట్రో మాట్లాడుతూ %ొా%. తుపాను తీవ్రతకు పెట్రోపోలిస్ నగరంలో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. ఎడతెరిపిలేని వానలకు క్విటాదిన్హా నది ఉప్పొంగి ప్రవహిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పుల వల్లే బ్రెజిల్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రమాద ప్రాంతాల్లో అధికార సిబ్బంది సహాయకచర్యలు చేపడుతున్నారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన ఒక బాలికను రెస్క్యూ సిబ్బంది కాపాడారు.

# 30 ఏళ్ల తర్వాత అధ్యక్షుడిగా దళిత అభ్యర్థి



**న్యూఢిల్లీ :** దేశంలోనే ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు)లో నిర్వహించిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. సుమారు 30 ఏళ్ల తర్వాత వామపక్ష కూటమి నుండి దళిత అభ్యర్థి ధనుంజయ్ మరోసారి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 1996-97లో వామపక్షాల నుండి జెఎన్‌యుఎస్‌యు మొదటి దళిత అధ్యక్షుడిగా లాల్ బైరవా ఎన్నికయ్యారు. 30 ఏళ్ల అనంతరం తిరిగి ధనుంజయ్ అధ్యక్షుడిగా ఎన్నికవడం గమనార్హం. ఎబివిపి అభ్యర్థి ఉమేష్ చంద్ర అజ్మీరా పై 2,598 ఓట్లతో గెలుపొందారు. ధనుంజయ్ బీహార్‌లోని గయ ప్రాంతానికి చెందినవారు. ఆయన జెఎన్‌యులోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఆస్తటిక్స్ లో పిహెచ్‌డి చేస్తున్నారు. జెఎన్‌యుఎస్‌యు అధ్యక్ష ఎన్నికల డిబేట్ సందర్భంగా.. యూనివర్శిటీ తీసుకున్న ఉన్నత విద్యా నిధుల ఏజన్సీ (హెచ్‌ఇఎఫ్‌ఎ) రుణాల కారణంగా ఫీజులు భారీగా పెరిగాయని ధనుంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో నీరు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# లండన్ రోడ్డు ప్రమాదం భారతీయ విద్యార్థిని మృతి...!



**లండన్ :** లండన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారత పిహెచ్‌డి విద్యార్థిని మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భారత పరిశోధక విద్యార్థిని చెయిస్తా కొచ్చర్ (33) లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పిహెచ్‌డి చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన కళాశాల నుంచి సైకిల్ తొక్కుకుంటూ సెంట్రల్ లండన్‌లోని తన ఇంటికి వెళుతుండగా, వేగంగా వచ్చిన ట్రక్కు సైకిల్ ను ఢకొట్టింది. ఆ సమయంలో ఆమె భర్త ప్రశాంత్ కొంత దూరంలోనే ఉన్నారు. వెంటనే వచ్చి ఆమెను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. తీవ్రగాయాలపాలైన కొచ్చర్ అప్పటికే మఅతి చెందారు. ఈ విషయాన్ని తాజాగా కొచ్చర్ తండ్రి రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్పీ కొచ్చర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ' ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం చెయిస్తా స్నేహితుల్లో, కుటుంబ సభ్యుల్లో విషాదం నింపింది. ఇది చాలా బాధాకరం. నేనింకా లండన్‌లోనే ఉన్నా చెయిస్తా అవశేషాలను సేకరించడానికి ప్రయత్నిస్తున్నా ' అని లింక్‌డిన్‌లో కొచ్చర్ తండ్రి పోస్టు చేశారు. ఆమె తండ్రి లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ (రిటైర్డ్) మఅతదేహాన్ని తీసుకురావడానికి లండన్‌కు చేరుకున్నారు. గురుగ్రామ్‌లో నివాసముండే చెయిస్తా.. సెప్టెంబరులోనే పీహెచ్‌డీ కోసం లండన్‌కి వెళ్లారు. గతంలో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయం, అశోక యూనివర్సిటీ, పెన్సిల్వేనియా, షికాగో విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించారు. 2021-23 మధ్య నీతి ఆయోగ్‌లోని నేషనల్ బహేవియరల్ ఇన్‌సైట్స్ యూనిట్‌లో సీనియర్ సలహాదారుగా సేవలందించారు. చెయిస్తా మరణ వార్తపై నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ స్పందించారు. ఆమె మఅతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# దేశం చూసిన అతిపెద్ద కుంభకోణం..!



**కన్నూర్ :** ఎన్నికల బాండ్లు దేశం చూసిన అతిపెద్ద కుంభకోణమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. కన్నూర్‌లో సీఏఏకు వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో సీపీఐ(ఎం) పిటిషన్ వేసిందని, దీంతోనే సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా ఆ సమాచారాన్ని దాచిపెట్టేందుకు కేంద్రం చాలా ప్రయత్నాలు చేసిందని, ఇందులో భాగంగానే దేశం దృష్టిని మరల్చిందేకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని అన్నారు. 'మన దేశం ఎటు పోతోంది. ఒక ముఖ్యమంత్రి ఇప్పుడు నిర్బంధంలో ఉన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమైనా చేస్తామనే వైఖరిలో ఉంది' అని విమర్శించారు.

# బోర్‌గా ఫీల్ అవ్వడం కూడా.. మంచిదేనట.....?

సాధారణం గా మనిషి జీవన శైలిలోని ప్రతి విషయం గురించి శాస్త్రవేత్తలు ఎప్పుడూ ఏదో ఒక అధ్యయనం చేస్తూనే ఉంటారు అన్న విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే సైంటిస్టులు చేసే ఈ అధ్యయనాలలో బయట పడే రిపోర్టులు..కొన్ని కొన్ని సార్లు అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తూ ఉంటాయి. ఏకంగా రోజు వారి పనులే ఆరోగ్యానికి మంచి చేస్తాయి అని కొన్ని కొన్ని సార్లు ఇలాంటి అధ్యయనాల రిపోర్టులు చెబుతూ ఉంటాయి అన్న విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు ఇలాంటి ఒక సర్వే రిపోర్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సాధారణం గా మనిషిగా పుట్టిన తర్వాత ఎప్పుడో ఒకసారి ఇక బోర్ కొట్టడం లాంటివి జరుగుతూ ఉంటుంది అన్న విషయం తెలిసిందే. అయితే ఇలా బోర్ కొట్టి నప్పుడు ఎవరైనా సరే పడుకోవడం లేదంటే రెస్ట్ తీసుకోవడం లాంటివి చేస్తూ ఉంటారు. కానీ ఇలా బోర్ కొట్టడం కూడా చాలా మంచిదే అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే బోర్ గా ఫీల్ అవ్వడం వల్ల కూడా ఎన్నో బెనిఫిట్స్ ఉంటాయి అని అంటున్నారు నిపుణులు. ఇలా ఎప్పుడైనా బోర్ కొట్టినప్పుడు ఫోన్ నీ పక్కన పెట్టి ఇక క్రియేటివిటి పై దృష్టి పెట్టాలి అంటూ సూచిస్తున్నారు. బోరింగ్ గా ఫీల్ అయినప్పుడు కొత్త ఆలోచనలు, కొత్త పనులు చేసేందుకు ప్రయత్నించాలి అంటూ చెబుతున్నారు. అంతేకాకుండా బోర్ గా అనిపించినప్పుడు ఇతరులతో మాట్లాడటం వల్ల కమ్యూనికేషన్ పెరిగి ఇక బంధాలు మరింత బలపడే అవకాశం ఉంది అంటూ చెబుతున్నారు. ఏ పని లేనప్పుడు అటు మనసుతో పాటు శరీరానికి కూడా విశ్రాంతి దొరుకుతుందని.. ఇది ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగ పడుతుంది అంటూ నిపుణులు చెబుతూ ఉండడం గమనార్హం. ఇలా బోర్ గా ఫీల్ అవ్వడం కూడా మంచిదే అంటూ సూచిస్తున్నారు నిపుణులు. ఏకంగా రోజు వారి పనులే ఆరోగ్యాని కి మంచి చేస్తాయి అని కొన్ని కొన్ని సార్లు ఇలాంటి అధ్యయనాల రిపోర్టులు చెబుతూ ఉంటాయి అన్న విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు ఇలాంటి ఒక సర్వే రిపోర్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సాధారణం గా మనిషిగా పుట్టిన తర్వాత ఎప్పుడో ఒకసారి ఇక బోర్ కొట్టడం లాంటివి జరుగుతూ ఉంటుంది అన్న విషయం తెలిసిందే.



## తాటి ముంజలు ప్రయోజనాలు...!



మార్చిలోనే ఎండలు స్టార్ట్ అయిపోయాయి. భానుడి భగభగలు రోజు రోజుకు పెరిగిపోతూ ప్రజలు భయాందోళనకు గురి చేస్తున్నాయి కానీ తగ్గడం లేదు. వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ కీలక సూచన చేసింది.దీంతో చాలా మంది అప్పుడే సమ్మర్ డైట్ స్టార్ట్ చేశారు. వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే ఎండ ఉన్న సమయంలోనే ఎక్కువగా ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా ఇంట్లో చల్లటి పానీయాలు తాగుతూ రెస్ట్ తీసుకుంటున్నారు. ఇక చిన్న పిల్లలు, వృద్ధులైతే సాయంత్రం వేళలో తప్ప ఎక్కువగా బయట తిరగడం లేదు. ఉద్యోగాలు చేసేవారికి ఎంత ఎండలు ఉన్నప్పటికీ వెళ్లక తప్పడం లేదు. అయితే ఎండాకాలం మొత్తం శరీరాన్ని చలువ చేసే వాటిని మాత్రమే తింటుంటారు. వేసవిలో మామిడి కాయలు, పుచ్చకాయలు, తాటి ముంజలు, కొబ్బరి బొండాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఇందులో తాటి ముంజలు చిన్న పెద్ద వయసుతో సంబంధం లేకుండా ఎంతో ఇష్టంగా తింటుంటారు. అయితే ఇవి కేవలం సమ్మర్‌లోనే దొరుకుతాయి కాబట్టి ఇవి ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. ప్రకృతి నుంచి వస్తాయి కాబట్టి కల్తీ లేనివి, స్వచ్ఛమైనవిగా చెబుతుంటారు. తాటి ముంజలు మండుటెండల నుంచి మంచి ఉపశమనం కలిగించడంతో పాటుగా శరీరానికి పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తాయి.

## ఉసిరికాయతో జరిగే మార్పులు...!



మన చుట్టూ పరిసరాలలో దొరికేటువంటి పండ్లు ఆకుకూరలతోనే మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. ముఖ్యంగా ఎన్నో రకాల పోషకాలు ఆరోగ్య ప్రయోజనాలు అందించే పనులు అందుబాటులోనే ఉన్నవి..ముఖ్యంగా ఇందులో ఉసిరికాయలు కూడా ఒకటి.. ఇవి ఆరోగ్య ప్రయోజనానికి దివ్య ఔషధంలా పనిచేస్తాయి. ఆయుర్వేద వైద్యంలో చాలా కాలంగా ఎన్నో సమస్యలకు సైతం ఉసిరిని ఉపయోగిస్తూ ఉన్నారు. వీటితో జ్యూస్ చేసుకొని తాగడం లేకపోతే ఊరగాయ చేసుకోవడం ఉసిరి పొడిని చేసుకొని తాగడం వల్ల కూడా మంచి ఉపయోగాలు ఉన్నాయి.రోజుకొక ఉసిరి పండును తింటే శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. రోజుకొక ఉసిరి పండు తినడం వల్ల శరీరంలో ఇన్ఫ్లమేషన్ తగ్గుతుంది. దీనివల్ల కణాల వినాశనం కూడా తగ్గుతుందట.. దీనివల్ల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఎటువంటి ప్రమాదం ఉండదు.. ఉసిరిలో ఉండేటువంటి విటమిన్-%జ% రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది.. అలాగే కీళ్లు ఆరోగ్యంగా ఉండడానికి కూడా ఉసిరి చాలా సహాయపడుతుంది. ఇందులో ఉండేటువంటి యాంటీ ఆక్సిడెంట్లు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.. ఉసిరికాయను తింటూ ఉండడం వల్ల రక్తంలో ఉండేటువంటి షుగర్ లెవెల్స్ ని కూడా నియంత్రిస్తుంది.. మధుమేహం ఉన్నవారు వీటిని తినడం చాలా మేలు చేస్తుంది. ఇది ఇన్సులిన్ గా ఉపయోగపడుతుంది.

## వేడి నీటిని తాగడం ప్రయోజనమేనా...?

వేడి నీటిని తాగడం వల్ల మనం చాలా రకాల అనారోగ్య సమస్యల నుండి చాలా సులభంగా బయటపడవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ వేడి నీటిని అసలు ఎవరు తాగాలి..? వేడి నీటిని తాగడం వల్ల ఏయే అనారోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు? పూర్తి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేసవికాలం తప్ప మిగిలిన అన్ని కాలాల్లో నీటిని వేడి చేసి తీసుకోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. అలాగే మలబద్ధకం సమస్యతో బాధపడే వారు కూడా రోజూ ఉదయం గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల సుఖ విరోచనం అవుతుంది. అలాగే కొందరిలో రోజూ ఉదయం పూట మాత్రమే గొంతు పట్టేసినట్టుగా ఉంటుంది. అలాంటి వారు కూడా గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే గ్యాస్ సమస్యతో బాధపడే వారు కూడా వేడి నీటిని తాగడం వల్ల చక్కటి ఉపశమనం కలుగుతుంది. నీటిని గోరువెచ్చగా చేసుకుని కాఫీ తాగినట్టు కొద్ది కొద్దిగా తాగడం వల్ల గ్యాస్ త్వరగా బయటకు పోతుంది. నీళ్ల విరోచనాలతో బాధపడే వారు, వాంతులతో బాధపడే వారు, గొంతు ఇన్ఫెక్షన్ తో బాధపడే వారు, టాన్సిల్స్ సమస్యతో బాధపడే వారు, సైనస్ సమస్యతో బాధపడుతున్నప్పుడు నీటిని కాచి మరిగించి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మనం తాగే నీటిలో ఉండే క్రిములు నేరుగా ఇన్ఫెక్షన్ కు గురి అయిన భాగాల మీద దాడి చేసి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. కనుక ఇటువంటి సమస్యలతో బాధపడుతున్నప్పుడు నీటిని మరిగించి నిల్వ చేసుకోవాలి.



## ఈ టీలు తాగితే జలుబు మాయం?



జలుబుతో బాధపడేటప్పుడు శరీరం కూడా వేడిగా అయ్యి జ్వరం వచ్చినట్టుగా ఉంటుంది. అలాంటి సమయంలో యారో టీని తాగడం వల్ల చాలా మంచి ఫలితం ఉంటుంది. ముక్కుదిబ్బడ, దగ్గు, జ్వరం వంటి వాటిని తగ్గించడంలో ఈ టీ అద్భుతంగా పని చేస్తుంది. జలుబుతో బాధపడే వారు లవంగాలతో టీని తయారు చేసి తీసుకోవడం వల్ల మంచి ఉపశమనం లభిస్తుంది. వీటిలో ఉండే యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు ఇన్ఫెక్షన్ ను తగ్గించడంలో, జలుబు వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే జలుబు చేసినప్పుడు గ్రీన్ టీని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్ తగ్గించడంలో సహాయపడతాయి.పిప్పర్ మెంట్ టీని తాగడం వల్ల కూడా చక్కటి ప్రయోజనం ఉంటుంది. ఈ టీని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముక్కు దిబ్బడ తగ్గుతుంది. ఈ టీని తాగడం వల్ల శరీరానికి కొత్త శక్తి వచ్చిన అనుభూతి కలుగుతుంది. నిమ్మకాయ మరియు అల్లం టీని తయారు చేసుకుని తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు మరియు అల్లంలో ఉండే యాంటీ ఇన్ ప్లామేటరీ లక్షణాలు జలుబును తగ్గించడంలో సహాయపడతాయి. జలుబుతో బాధపడేటప్పుడు యాంటీ వైరల్ లక్షణాలు కలిగిన లైకోరైస్ టీని తీసుకోవడం వల్ల చక్కటి ఉపశమనం కలుగుతుంది. దగ్గు, గొంతునొప్పి, జలుబు వంటి సమస్యల నుండి ఈ టీ మంచి ఉపశమనాన్ని ఇస్తుంది.జలుబు నుండి చక్కటి ఉపశమనాన్ని కలిగించడంలో చమోమిలే టీ మనకు ఎంతగానో సహాయపడుతుంది. ఒక కప్పు చమోమిలే టీ ని తాగి చక్కగా విశ్రాంతిని తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల గొంతు నొప్పి, మంట, జలుబు నుండి ఉపశమనం కలుగుతుంది.యాంటీ బయాటిక్ లను వాడకుండా తరుచూ వీటిని వాడడం వల్ల భవిష్యత్తులో మనం అనేక దుష్ప్రభావాల బారిన పడకుండా ఉంటాము. కాబట్టి వీటికి బదులుగా జలుబు నుండి ఉపశమనాన్ని కలిగించే ఈ హెర్బల్ టీలను తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిని తాగడం వల్ల జలుబు నుండి, జలుబు లక్షణాల నుండి చాలా ఈజీగా ఉపశమనం కలుగుతుంది.కాబట్టి ఖచ్చితంగా వీటిని తాగండి.

## దగ్గు, కఫం చిటికెలో తగ్గే టిప్స్.....?



దగ్గుతో బాధపడే వారు నీటిలో తులసి ఆకులు వేసి మరిగించాలి. తరువాత ఈ నీటిని వడకట్టి అందులో తేనె వేసి కలిపి తీసుకోవాలి. దగ్గు, కఫాన్ని తగ్గించడంలో తులసి ఆకుల టీ చక్కగా పని చేస్తుంది.వెల్లుల్లి రెమ్మలను నోటిలో వేసుకుని నమలడం అలాగే వెల్లుల్లిని నీటిలో వేసి మరిగించి ఆ నీటిని తీసుకోవడం వల్ల దగ్గు సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది.వెల్లుల్లిలో ఉండే యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు ఇన్ఫెక్షన్ ను తగ్గించడంలో మనకు సహాయపడతాయి. అలాగే రాత్రి నిద్రపోయే ముందు తల కింద ఎత్తైన తలగడను ఉంచి నిద్రపోవాలి. లేదా తలవైపు మంచం ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల రాత్రిపూట దగ్గు రాకుండా ఉంటుంది. అలాగే దగ్గు, ఛాతిలో అసౌకర్యం, కఫం వంటి సమస్యలతో బాధపడే వారు వేడిపాలల్లో పసుపు కలిపి తీసుకోవాలి.

## చెరుకు రసం తాగడం వల్ల లాభమా..!



వేసవికాలం వచ్చిందంటే చాలు ఈ సమయంలో ఎక్కువగా వేసవి నుంచి మనం రక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలను మనం పాటిస్తూనే ఉంటాము.. ముఖ్యంగా మన ఆరోగ్యం క్షీణించకుండా శరీరం చల్లబడుతుందని వేసవి తాపం నుంచి బయటపడడానికి పలు రకాల జ్యూసులు కూడా తాగుతూ ఉంటాము.. అయితే ఈ సమయంలో చాలామంది ఎక్కువగా తాగేటువంటి వాటిలో చెరుకు రసం కూడా ఒకటి.. చెరుకు రసంలో మెగ్నీషియం ,జింక్, ఐరన్ ,క్యాల్షియం, పొటాషియం వంటి పోషకాలు కూడా ఎక్కువగా లభిస్తాయి. ఇవి మన శరీరానికి కూడా చాలా ముఖ్యమైనవిగా చెప్పవచ్చు..చెరుకు రసం తరచు తాగడం వల్ల మనకు చాలా ప్రమాదం ఉంటుందట.. అందుకే చెరుకు రసం ఎక్కువగా తాగడం వల్ల లాభాల కంటే నష్టాలు ఎక్కువగా ఉంటాయని తెలుస్తోంది. చెరుకు రసం తాగడం వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని అధ్యయనాలలో ఇందులోని క్యాలరీలు అధికంగా ఉండడం వల్ల చక్కెర స్థాయి ఎక్కువగా ఉండడం వల్ల రక్తంలో ఇది త్వరగా కలుస్తుందట. దీనివల్ల ఉబకాయం కూడా పెరుగుతుందని కొంతమంది పరిశోధకులు తెలియజేశారు. చెరుకు రసంలో ఉండేటువంటి పాలికోసనల్ పదార్థం వల్ల రక్తాన్ని చాలా పలుచగా చేస్తుంది. ఇది శరీరంలో ఉండేటువంటి రక్తం గడ్డ కట్టకుండా కూడా చేస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు గాయమైనప్పుడు రక్తం కారుతుంది తప్ప గడ్డకట్టకుండా చేస్తుందట. అందుకే చెరుకు రసాన్ని ఎక్కువగా తాగకపోవడమే మంచిది. యాంటీ ఆక్సిడెంట్ అధికంగా ఉండేటువంటి వాటిలో చేరుకు రసం కూడా ఉంటుంది అందుకే చెరుకు రసం కామెర్ల వ్యాధికి బెస్ట్ చికిత్స అని కూడా చెప్పవచ్చు అలాగే కాలేయాన్ని కూడా చాలా బలంగా ఉంచేలా చేస్తుంది. చెరుకు రసంలో వివిధ యాంటీ ఆక్సిడెంట్లు కాలేయాన్ని ఇన్ఫెక్షన్ నుంచి కూడా రక్షిస్తాయి. అలాగే కామెర్ల వ్యాధితో బాధపడుతున్నప్పుడు ఇవి మన శరీరంలోని ప్రోటీన్ ని సైతం విచ్ఛిన్నం అయ్యేలా చేస్తాయి. దీన్ని బట్టి ఏం చెప్పవచ్చు. అంటే చెరుకు రసం ఎక్కువగా తాగడం కంటే తగిన మోతాదులలో తీసుకోవడమే ఉత్తమం. ఇవి మన శరీరానికి కూడా చాలా ముఖ్యమైనవిగా చెప్పవచ్చు..చెరుకు రసం తరచు తాగడం వల్ల మనకు చాలా ప్రమాదం ఉంటుందట.. అందుకే చెరుకు రసం ఎక్కువగా తాగడం వల్ల లాభాల కంటే నష్టాలు ఎక్కువగా ఉంటాయని తెలుస్తోంది. చెరుకు రసం తాగడం వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని అధ్యయనాలలో ఇందులోని క్యాలరీలు అధికంగా ఉండడం వల్ల చక్కెర స్థాయి ఎక్కువగా ఉండడం వల్ల రక్తంలో ఇది త్వరగా కలుస్తుందట.



# వారసుడొచ్చాడు

జూనియర్ హీరో హీరోయిన్లు ఎంట్రీ ఇస్తున్నారు! అదేనండీ నటీమణులతో పాటు నటుల భార్యలు పండంటి బిడ్డలకు జన్మనిస్తున్నారు. జూనియర్ హీరో హీరోయిన్లు ఎంట్రీ ఇస్తున్నారు! అదేనండీ నటీమణులతో పాటు నటుల భార్యలు పండంటి బిడ్డలకు జన్మనిస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ బ్యూటీ, క్రికెటర్ విరాట్ కోహ్లీ సతీమణి అనుష్క శర్మ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తాజాగా టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ తండ్రిగా ప్రమోషన్ కొట్టేశారు. ఆయన భార్య పల్లవి బుధవారం ఉదయం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని నిఖిల్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తన ఆనందాన్ని ఫ్యాన్స్ తో షేర్ చేసుకున్నారు. తన కొడుకును ఎత్తుకున్న ఫొటోను షేర్ చేశారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నిఖిల్ భార్య ప్రసవించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సందర్భంగా నిఖిల్–పల్లవి కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆసుపత్రికి వెళ్లి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. నెట్టింట ఫ్యాన్స్ కూడా నిఖిల్ కు కంగ్రాట్స్ చెబుతున్నారు. అయితే నిఖిల్ తన భార్య.. ప్రెగ్నెంట్ అని మొన్నమొన్నటి వరకు ఎక్కడా రివీల్ చేయలేదు. డైరెక్ట్ గా పల్లవి సీమంతం ఫొటోలను షేర్ చేసి అభిమానులకు సర్ ప్రైజ్ ఇచ్చారు. భార్యతో కలిసి దిగిన ఫొటోలు షేర్ చేశారు. ఇటీవల బేబీకి డైపర్ ఎలా వేయాలో కూడా నేర్చుకున్నారు. అందుకు సంబంధించిన ఫన్నీ వీడియో కూడా పోస్ట్ చేశారు. కొన్నేళ్ల పాటు ప్రేమించుకున్న నిఖిల్, పల్లవి 2020లో ఇంట్లో ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఇక డైరెక్టర్ శేఖర్ కమ్ముల తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ హ్యాపీ డేస్ తో టాలీవుడ్ లోకి హీరోగా ఎంట్రీ ఇచ్చారు నిఖిల్. ఆ తర్వాత వివిధ చిత్రాల్లో నటించారు. కార్తికేయ, స్వామిరారా సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. కార్తికేయ 2 సినిమాతో ఏకంగా పాన్ ఇండియా స్టార్ గా మారిపోయారు. ఇప్పుడు మరో పాన్ ఇండియా చిత్రం స్వయంభులో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ మూవీలో నిఖిల్ యుద్ధ వీరుడిగా అలరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ నుంచి రిలీజైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ మూవీతోనే భరత్ కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మొత్తానికి ఈ సినిమా కోసం నిఖిల్ ఫ్యాన్స్ తోపాటు మూవీ లవర్స్ ఈగర్లీ వెయిట్ చేస్తున్నారు. మరి ఈ చిత్రం ఎలా ఉంటుందో వెయిట్ అండ్ సీ.



# దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల విజేతలు వీరే!




2024 ఏడాదికి గానూ ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డులను వేడుక అట్టహాసంగా ముంబైలో జరిగింది. 2024 ఏడాదికి గానూ ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డులను వేడుక అట్టహాసంగా ముంబైలో జరిగింది. షారుక్ ఖాన్..రాణీముఖర్జీ..నయనతార..సందీప్ రెడ్డి వంగా తదితరులకు అవార్డులు దక్కాయి. 'జవాన్' సినిమాలో నటించిన షారుక్ ఖాన్ కి బెస్ట్ యాక్టర్ కేటగిరిలో అవార్డు దక్కగా.. అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నయనతారకు బెస్ట్ యాక్ట్రెస్ అవార్డ్ దక్కింది. 'జవాన్' కి మ్యూజిక్ అందించిన అనిరుద్ రవిచంద్రన్ కి కూడా బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ కేటగిరిలో అవార్డ్ అందుకున్నాడు. ఇక తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కెరీర్ లో అత్యంత వేగంగా ఫాల్కే అవార్డు అందుకోవడం విశేషం. ఆయన దర్శకత్వం వహించిన 'యానిమల్' చిత్రంగానూ ఉత్తమ దర్శకుడి హోదాలో అవార్డు అందుకున్నారు. దీంతో సందీప్ పేరు నెట్టింట మారుమ్రోగుతోంది. ఓ తెలుగు దర్శకుడు తక్కువ సమయంలోనే అరుదైన ఘనత సాధించాడని అభిమానులు విషెస్ తెలియజుస్తున్నారు. ఇక క్రిటిక్స్ విభాగం నుంచి విక్కీ కౌశల్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు. 'సామ్ బహదూర్' చిత్రంలో తన నటనకు గానూ ఈ గుర్తింపు దక్కింది. అయితే ఈసారి ఉత్తమ నటి అవార్డులను ఇద్దరు హీరోయిన్లు పంచుకోవడం విశేషం. వారే నయనతార... రాణీముఖర్జీ. వీరితో పాటు ఇంకా ఫాల్కే అవార్డులు అందుకున్న వారు వీరే. బెస్ట్ యాక్టర్: షారుఖ్ ఖాన్, జవాన్ బెస్ట్ యాక్ట్రెస్: నయనతార, జవాన్ బెస్ట్ యాక్ట్రెస్: రాణి ముఖర్జీ మిసెస్ ఛాటర్జీ వర్సెస్ నార్వే బెస్ట్ డైరెక్టర్: సందీప్ రెడ్డి వంగా, యానిమల్ బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్: అనిరుధ్ రవిచందర్, జవాన్ బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్ (మేల్): వరుణ్ జైన్, తేరే వాస్తే (జరా హాట్కే జరా బచ్కే) బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్ (ఫీమేల్): శిల్పా రావు, బేషరం రంగ్ (పఠాన్) బెస్ట్ యాక్టర్ ఇన్ నెగెటివ్ రోల్: బాబీ డియోల్, యానిమల్ బెస్ట్ యాక్ట్రెస్ట్ ఇన్ టీవీ సిరీస్: రూపాలీ గంగూలీ, అనుపమా బెస్ట్ యాక్టర్ ఇన్ టీవీ సిరీస్: నీల్ భట్, ఘుమ్ హై కిసీకే ప్యార్ మే టీవీ సిరీస్ ఆఫ్ ది ఇయర్: ఘుమ్ హై కిసీకే ప్యార్ మే బెస్ట్ యాక్ట్రెస్ ఇన్ వెబ్ సిరీస్: కరిష్మా తన్నా, స్కూప్ ఔట్‌స్టాండింగ్ కంట్రిబ్యూషన్ టు ది ఫిల్మ్ ఇండస్ట్రీ: మౌషుమీ చాటర్జీ ఔట్‌స్టాండింగ్ కంట్రిబ్యూషన్ టు ది మ్యూజిక్ ఇండస్ట్రీ: కేజే యేసుదాస్



# చెన్నైలో ఎక్కడ కలవాలి?

నిజానికి కమల్ హాసన్ చెన్నై అల్వార్‌పేట్‌లోని తన రాజభవన గృహంలో అతడు షూటింగ్ లేని సమయంలో ఎక్కువగా నివాసం ఉంటాడు. తెలుగు సినీపరిశ్రమలో చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారు. దర్శకులు, రచయిత లు, నిర్మాతలు తమ ఫేవరెట్ స్టార్లతో కలిసి పని చేయాలని అనుకుంటారు. కానీ కమ్యూనికేషన్ కొంత ఇబ్బందికరం. కానీ ప్రయత్నిస్తే ఏదీ అసాధ్యం కాదు. ఒకవేళ విశ్వనటుడు కమల్ హాసన్ కి కథ వినిపించాలంటే.. సినిమా తీయాలంటే అతడిని కలవడం ఎలా? ఆన్ లైన్ లో సందేహం వెలిబుచ్చిన ఒక రైటర్ కి దొరికిన సమాధానం ఇలా ఉంది. ప్రస్తుతం క్షణం తీరిక లేని సీనియర్ స్టార్లలో ఒకరు. సినిమా బ్లాక్ బస్టర్ విజయం సాధించాక అతడిని క్యాచ్ చేయాలంటే చాలా కష్టంగా మారిందని తెలుస్తోంది. అతడు ఇప్పటికిప్పుడు ఇటు తెలుగులో ప్రభాస్ తో కలిసి కల్కి (ప్రాజెక్ట్ కే) లాంటి భారీ చిత్రంలో నటిస్తున్నాడు. మరోవైపు తమిళ చిత్రాలు, సినిమాల నిర్మాణంతో బిజీగా ఉన్నాడు. టీవీ రియాలిటీ షోలతోను బిజీ. నిజానికి కమల్ హాసన్ చెన్నై అల్వార్‌పేట్‌లోని తన రాజభవన గృహంలో అతడు షూటింగ్ లేని సమయంలో ఎక్కువగా నివాసం ఉంటాడు. ఈ ఇల్లు సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌కు కార్యాలయం కూడా. కమల్ రాజకీయ పార్టీ మక్కల్ నీది మయ్యమ్‌కు ప్రధాన కార్యాలయంగా కూడా పనిచేస్తుంది. ఒకవేళ ఆయన బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్‌సీజన్‌లో ఉంటే, అతడు తన పోర్షన్‌లను షూట్ చేయడానికి తరచుగా చెంబరంబాక్కం ఫిల్మ్ సిటీని సందర్శిస్తారు. ఇది కాకుండా చెన్నైలోని ఒక రెసిడెన్షియల్ సొసైటీలలో కమల్‌ని అతని సూపర్ ఫ్లాంబాయింట్ అపార్ట్‌మెంట్‌లలో కలవొచ్చు. అయితే కమల్‌ని అపార్ట్‌మెంట్‌లలో కలిసే అవకాశాలు పరిచయస్తులు లేకుండా కష్టం. కానీ అక్కడ అతడు ఎక్కడికి వెళుతున్నాడో వివరాలు సంపాదించగలరు.కనీసం ఎవరైనా పార్టీ కార్యకర్తగా లేదా చేతిలో వినతిపత్రం పట్టుకుని సానుభూతిపరుడిగా ఆళ్వార్‌పేటలోని ఆయన నివాసానికి చేరుకునే ప్రయత్నం చేయవచ్చు. ఈ ప్రదేశాలు కాకుండా మీరు కమల్ హాసన్ రెగ్యులర్ డే టు డే షెడ్యూల్ గురించి తెలుసుకుంటే కలిసేందుకు పని సులువు అవుతుంది. అతడిని రెగ్యులర్‌గా విమానాశ్రయంలోను చూడవచ్చు. చాలా మంది నటీనటులు నిరంతరం ప్రయాణాల్లో ఉంటారు గనుక ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో అతన్ని కలవడం దాదాపు అసాధ్యం. కలిసినా కానీ సెలబ్రిటీలు అలాంటి ప్రదేశాలలో అపాయింట్‌మెంట్‌లు ఇవ్వరు. మీరు అదృష్టవంతులైతే సెల్ఫీ కోసం పోజులిచ్చి అతడితో కరచాలనం చేయడం ఒక్కటే మీరు చేయగలిగేది. చెన్నైలో కమల్ కనువిందు చేయబోయే ప్రదేశాలు ఇంకా ఏవి? అంటే... ఆయన సన్నిహిత మిత్రుడు– క్రేజీ మోహన్ ఒక ఆధారం. అతడి ఇంటికి కమల్ హాసన్ తరచుగా వెళుతుంటాడు. కమల్ ఇటీవల తన ఇంటిని సందర్శించడం మానేశాడు. ఇప్పుడు సినిమా షూటింగ్‌లో ఎక్కువ భాగం తమిళనాడు వెలుపల జరుగుతుండటంతో అతడు ఎవరికీ చిక్కడం లేదు. కమల్ హాసన్ కుమార్తెలు కూడా అతడికి దూరంగానే నివశిస్తున్నారు గనుక వారి ద్వారా అయినా వెంటనే కలవడం కుదరదు. దానికి చాలా ప్రయత్నించాలి.

# నా ప్రమేయం ఏం లేదు..!



రీసెంట్ గా కెప్టెన్ మిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కోలీవుడ్ స్టార్ ధనుష్ ఇలా ఒక సినిమా రిలీజైందో లేదో మరో సినిమా పోస్టర్ తో సర్ ప్రైజ్ చేశాడు. రీసెంట్ గా కెప్టెన్ మిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కోలీవుడ్ స్టార్ ధనుష్ ఇలా ఒక సినిమా రిలీజైందో లేదో మరో సినిమా పోస్టర్ తో సర్ ప్రైజ్ చేశాడు. ధనుష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా రాయన్. సన్ పిక్చర్స్ బ్యానర్ లో ఈ సినిమా రూపొందుతుంది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ తో వచ్చాడు ధనుష్. ధనుష్ మైల్ స్టోన్ మూవీగా 50వ ప్రాజెక్ట్ గా వస్తున్న ఈ రాయన్ మీద భారీ అంచనాలు ఉన్నాయి. అయితే రాయన్ సినిమా స్క్రిప్ట్ గురించి సెల్వ రాఘవన్ లేటెస్ట్ ట్వీట్ ఆడియన్స్ ని షాక్ అయ్యేలా చేసింది. రాయన్ సినిమా కథకు తనకు ఎలాంటి సంబంధం లేదని ధనుష్ సొంతంగా ఆ కథ రాసుకున్నాడని. అతని డ్రీం ప్రాజెక్ట్ అదని ఎక్స్ లో రాసుకొచ్చారు సెల్వ రాఘవన్. రాయన్ స్క్రిప్ట్ తనదంటూ వచ్చిన వార్తలకు ఆయన స్పందిస్తూ ఇలా కామెంట్ చేశారు. రాయన్ స్క్రిప్ట్ లో తన ప్రమేయం లేదని ధనుష్ సొంతం గా ఈ కథ రాసుకున్నాడని చెప్పుకొచ్చారు. అంతేకాదు ధనుష్ హార్డ్ వర్క్ ఎప్పుడు తనకు స్ఫూర్తి కలిగిస్తుందని. తను డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా కోసం నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఎక్స్ లో కామెంట్ పెట్టారు డైరెక్టర్ సెల్వ రాఘవన్. తను కేవలం ఈ సినిమాలో నటిస్తున్నాను తన్న సినిమా స్క్రిప్ట్ లో తన ప్రమేయం లేదని క్లారిటీ ఇచ్చారు. ధనుష్ 50వ సినిమాగా వస్తున్న రాయన్ ఫస్ట్ లుక్ రిలీజ్ టైం లో తన బ్రదర్ సెల్వ రాఘవన్ కథతో ధనుష్ ఈ సినిమా చేస్తున్నాడని వార్తలు వచ్చాయి. వాటికి సమాధానం ఇస్తూ అది ధనుష్ డ్రీం ప్రాజెక్ట్ అని చెప్పుకొచ్చారు సెల్వ రాఘవన్. ధనుష్ రాయన్ సినిమాలో తెలుగు హీరో సందీప్ కిషన్ కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తున్నాడు. ఆల్రెడీ ధనుష్ నటించిన కెప్టెన్ మిల్లర్ సినిమాలో కూడా సందీప్ కిషన్ చేశాడు. మళ్లీ ఇప్పుడు రాయన్ లో కూడా అతను నటిస్తున్నాడు. ఇక ఈ సినిమాతో పాటుగా ధనుష్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ధనుష్ తో పాటుగా కింగ్ నాగార్జున కూడా ఈ సినిమాలో భాగం అవుతున్నారు. ధనుష్ 50 రిలీజ్ ఎప్పుడన్నది అనౌన్స్ చేయలేదు. ఈ ఇయర్ లోనే రిలీజ్ ఉంటుందని తెలుస్తుంది.



# వాట్సే వర్కౌట్స్ ఆషిక!

క్యూట్ లుక్స్‌కు ఓ ఇమేజ్ అంటారు టాలీవుడ్ సినీ ప్రియులు. గతేడాది నందమూరి కల్యాణ్ రామ్ నటించిన అమిగోస్ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది ఆషికా రంగనాథ్.. క్యూట్ లుక్స్ కు ఓ ఇమేజ్ అంటారు టాలీవుడ్ సినీ ప్రియులు. గతేడాది నందమూరి కల్యాణ్ రామ్ నటించిన అమిగోస్ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ కన్నడ బ్యూటీ. బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ బోల్తా కొట్టినప్పటికీ.. ఆషిక గ్లామర్ కు మాత్రం యూత్ ఫిదా అయ్యారు. ఆ తర్వాత తెలుగులో సెకండ్ మూవీకే నాగార్జునతో నటించే ఛాన్స్ కొట్టేసింది ఈ అమ్మడు. సంక్రాంతికి వచ్చిన నా సామిరంగా చిత్రంలో మిడిల్ ఏజ్డ్ రోల్ లో నటించింది ఆషికా రంగనాథ్. వరాలు పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకుంది. దీంతో ఈ అమ్మడికి క్రేజ్ పెరిగింది. కానీ ఆషిక మాత్రం ఆచితూచి అడుగులేస్తోంది. పదుల సంఖ్యలో అవకాశాలు వస్తున్నా.. వాటిలో నుంచి సెలెక్టివ్ గా సినిమాలను ఎంచుకుంటుంది. అయితే సోషల్ మీడియాలో ఆషిక ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. తన అందచందాలతో కుర్రకారును మాయ చేస్తుంటోంది. శారీల్లో దిగిన ఫొటోలు పోస్ట్ చేస్తూ దేవ కన్యలా ఫిదా చేస్తోంది. నెటిజన్లను ఓ రేంజ్ లో ఎట్రాక్ట్ చేస్తుంటోంది. తాజాగా బ్యాక్ ఇన్ యాక్షన్ అంటూ తన వర్కౌట్స్ వీడియోను పోస్ట్ చేసింది. నిజమైన వర్కౌట్స్ సెషన్ అంటే ఏంటో తన ట్రైనర్ గుర్తు తెస్తారని క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఆషిక వర్కౌట్స్ వీడియో సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ మారింది. టైట్ జిమ్ వేర్ వేసుకున్న ఆషిక.. ప్రతీ ఒక్క ఎక్విప్ మెంట్‌తో ఓ రేంజ్‌లో వర్కౌట్స్ చేసింది. ఎలాంటి పరికరం అయినా తగ్గేదేలే అంటూ జిమ్ చేసింది. మధ్యలో క్యూట్ నవ్వుతూ రిలాక్స్ అయింది. వార్మప్ తో పాటు యోగాసనాలు కూడా వేసింది. ఆషిక వర్కౌట్స్ చూసి నెటిజన్లు షాకవుతున్నారు. వాట్సే వర్కౌట్స్ ఆషిక అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. కసరత్తులు అంత తీవ్రంగా ఏ సినిమా కోసం చేస్తుందో అంటూ చర్చించుకుంటున్నారు. మరోవైపు, ఆషికకు చిరంజీవి విశ్వంభర మూవీలో ఛాన్స్ వచ్చినట్లు సమాచారం. సోషియో ఫాంటసీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మెగాస్టార్‌కు ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉంటారట. ఆ పాత్రలన్నింటికీ మూవీలో మంచి ఇంపార్టెన్స్ ఉంటోందట. అందులో ఒక పాత్ర కోసం ఆషికను మేకర్స్ సంప్రదించారట. పాత్రకు మంచి వెయిటేజ్ ఉందని ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. మరి ఇందులో నిజమెంతో చూడాలి.

# 16 ఏళ్ల క్రితం మొదలు.. 6 ఏళ్ల నుంచి షూటింగ్..




ఒక్కోసారి ఎంత పెద్ద స్టార్ హీరో సినిమా అయినా ఏళ్లకి ఏళ్లు షూటింగ్‌తోనే గడిచిపోతూ ఉంటుంది. రిలీజ్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాల్సిందే. తాజాగా మలయాళ హీరో పృథ్వీరాజ్ నటించిన మచ్ అవైటింగ్ మూవీ ఎట్టకేలకి రిలీజ్?కి సిద్ధమైంది. మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవలే సలార్: పార్ట్ 1 సినిమాతో ఆడియన్స్‌ను పలకరించారు. ఈ చిత్రంలో ప్రభాస్ స్నేహితుడు వరదరాజ మన్నార్‌గా పృథ్వీరాజ్ యాక్టింగ్ ఇరగదీశారు. మాలీవుడ్‌లో ఎన్నో హిట్ సినిమాల్లో నటించిన పృథ్వీరాజ్ హీరో మాత్రమే కాకుండా డైరెక్టర్, సింగర్, రచయిత కూడా. ఇక తాజాగా ఆయన నటించిన 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. మార్చి 28న ఈ సినిమా పాన్ ఇండియా లెవల్లో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.16 ఏళ్లకి ముందు... ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. "కాన్సెప్ట్ అనుకుని 16 ఏళ్లవుతోంది.. స్క్రిప్ట్ రాసి 10 ఏళ్లవుతోంది.. షూటింగ్ స్టార్ట్ అయి 6 ఏళ్లవుతోంది.. ఇక ఈ వెయిటింగ్ ఎండింగ్‌కి చేరింది" అంటూ పోస్టర్‌పై రాశారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఈ సినిమాను అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించింది. 90వ దశకంలో జీవనోపాధి కోసం కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథను వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాలో చూపించబోతున్నారు. అయితే ఇన్నేళ్ల పాటు సాగిన ఈ మూవీ జర్నీ విని చాలా మంది ఆడియన్స్ అవాక్కవుతున్నారు. అయితే సినిమా మాత్రం చాలా గొప్పగా ఉంటుందని ఈ నవల చదివిన పాఠకులు అభిప్రాయపడుతున్నారు. ఖచ్చితంగా ఈ చిత్రంతో హీరో పృథ్వీరాజ్‌కి మరిన్ని ప్రశంసలు దక్కడం ఖాయమంటూ మలయాళ ఆడియన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇప్పటివరకూ ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించిన పృథ్వీరాజ్ కెరీర్‌లో ఈ క్యారెక్టర్ మరో మైలురాయిగా నిలిచిపోతుందని ఆశిస్తున్నారు. 'ఆడు' అంటే మలయాళంలో మేక అని అర్థం. అంటే గోట్ లైఫ్ టైటిల్‌నే ట్రాన్స్‌లేట్ చేసి ఆడు జీవితం అంటూ రిలీజ్ చేస్తున్నారు.

# తాను సిద్ధమే!

ప్రస్తుతం టాలీవుడ్‌లో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తోంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన 'ఆపరేషన్ వాలంటైన్' తో పాటు..మరో రెండు మూడు సినిమాలు చేస్తోంది. మాజీ మిస్ వరల్డ్..మిస్ ఇండియా మానుషీ చిల్లర్ సుపరిచితురాలే. ఇప్పుడిప్పుడే నటిగా బిజీ అవుతోంది. ఇప్పటికే బాలీవుడ్ లో 'సామ్రాట్ పృథ్వీరాజ్' లో కనిపించింది. కానీ అమ్మడికి డెబ్యూ ఆశించిన ఫలితా న్నివ్వలేదు. అటుపై నటించిన 'గ్రేట్



ఇండియన్ ఫ్యామిలీ' కూడా నిరాశనమే మిగిల్చింది. అయినా ఆ వైఫల్యాలేవి మానుషి కెరీర్ పై పెద్దగా ప్రభావం చూపలేదు. కొత్త అవకాశాలు అందుకుంటూనే ఉంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తోంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన 'ఆపరేషన్ వాలంటైన్' తో పాటు..మరో రెండు మూడు సినిమాలు చేస్తోంది. ఇప్పటికే రిలీజ్ అయిన 'ఆపరేషన్ వాలంటైన్' ప్రచార చిత్రాలు సినిమాకి మంచి బజ్ తీసుకొచ్చాయి. మార్చిలో సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో యూనిట్ ప్రచారం పనులు మొదలు పెట్టింది. దీనిలో భాగంగా మానుషి కెరీర్ కి సంబంధించి ఆసక్తిర విషయాలు పంచుకుంది. 'ప్రస్తుతం అనేది కేవలం ఏడాది మాత్రమే ఉంటుందేమో. ఆ తర్వాత కెరీర్ ని నిర్దేశించాల్సింది నటన మాత్రమే. మిస్ ఇండియా –మిస్ వరల్డ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు అనేవి కేవలం ఎంట్రీ వరకే. అవి పరిచయం చేయడం వరకే పరిమితం. నా దృష్టిలో అది కూడా కష్టమే. అలా కానీ పక్షంలో నటన అనేది తొలి నుంచి ప్రారంభించాల్సి ఉంటుంది. కాల క్రమంలో మెరుగైన నటనతో మెప్పించాల్సి ఉంటుంది. నటి ఎప్పుడూ ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ఉండాలి. ఆపరేషన్ వాలెంటైన్ ఫలితం గురించి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఐశ్వర్యరాయ్ – సుష్మితా సేన్ పోషించిన గ్లామర్ పాత్రలు నేను పోషించడానికి సిద్ధంగా ఉన్నాను. అందాల పోటీ విజేతలుగా మాకు ఉన్న ఒక ఎడ్జ్ లాంటిది అది. నేను స్క్రీన్‌పై అల్ట్రా–గ్లామరస్‌గా కనిపించడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాను' అని అంది.

# మరో కేరళ కుట్టి

మలయాళ సినిమాలకి తెలుగులో మంచి డిమాండ్ ఉంది. అందుకే అక్కడ హిట్ అయిన సినిమాలను వెంటనే డబ్ చేసి తెలుగులోనూ రిలీజ్ చేస్తుంటారు. తాజాగా 'ప్రేమలు' అనే సినిమా మలయాళంలో బ్లాక్ బస్టర్ అయింది. ముఖ్యంగా అందులో హీరోయిన్‌కి తెగ క్రేజ్ వచ్చింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన మాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ 'ప్రేమలు' సినిమా గురించే చర్చ నడుస్తోంది. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిన్న చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ హిట్‌గా నిలిచింది. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌కి ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ముఖ్యంగా ఇందులో హీరోయిన్ రీనూ పాత్రలో నటించిన మమిత బైజు ఓవర్‌నైట్ స్టార్ అయిపోయింది. ఆమె క్యూట్‌నెస్‌కి ఆడియన్స్ మెల్ట్ అయిపోయారు. దీంతో మమితకి మలయాళంలోనే కాకుండా తెలుగులోను మంచి ఆఫర్స్ వస్తున్నాయట. లక్కీ ఛాన్స్.... పలువురు టాలీవుడ్ బడా నిర్మాతలు మమితను తమ సినిమాలో హీరోయిన్‌గా తీసుకునేందుకు సంప్రదిస్తున్నారట. కనుక త్వరలోనే ఆమె టాలీవుడ్‌లో అడుగుపెట్టే అవకాశం కనిపిస్తుంది. అన్నీ వర్కవుట్ అయితే త్వరలోనే ఓ పెద్ద ప్రాజెక్ట్‌తో ఆమె తెలుగులో అరంగేట్రం చేయొచ్చని అంటున్నారు. ఇక మలయాళంలో సూపర్ హిట్ అయిన 'ప్రేమలు' సినిమాను తెలుగులోకి డబ్ చేసేందుకు చూస్తున్నారట. ఇక మమిత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కి పెద్ద ఫ్యాన్ కావడం విశేషం. నార్మల్‌గానే మాలీవుడ్‌లో బన్నీకి సూపర్ క్రేజ్ ఉంది. ఇక పుష్ప సినిమాతో ఇది మరింత పెరిగింది. అయితే మమిత తాను ఎప్పటి నుంచో అల్లు అర్జున్‌కి పెద్ద ఫ్యాన్ అని ఆయన సినిమాలు మిస్ అవ్వకుండా చూస్తానంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. అలానే ప్రేమలు మూవీ షూటింగ్ హైదరా బాద్‌లో జరిగిన సమయంలో చాలా సార్లు బన్నీ ఇంటి ముందు ముంచే ట్రావెల్ చేసినట్లు చెప్పుకొచ్చింది.



# ఏథర్ నుంచి సరికొత్త ఎక్స్‌చేంజ్ పాలసీ.....



ఏథర్ అప్ గ్రేడ్ ప్రోగ్రామ్ అనేది మార్చి 31 వరకూ అందుబాటులో ఉంటుంది. పాత మొడళ్లైన ఏథర్ 450 జెన్ 1 జెన్ 1.5 స్కూటర్లు కలిగి ఉన్న వారు ఏథర్ 450ఎక్స్ కి అప్ గ్రేడ్ కావొచ్చు. ఈ స్కూటర్ కావాలనుకుంటే మార్చి 31లోపు వారి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే ఏథర్ 450 అపెక్స్ మోడల్ తీసుకోవాలనుకుంటే మాత్రం వారికి ఏప్రిల్ 30 వరకూ సమయం ఉంటుంది. మన దేశంలో అత్యధికంగా అమ్ముడువుతున్న ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఏథర్ ఎనర్జీకి చెందనవి టాప్ ప్లేస్ లో ఉంటాయి. స్పోర్టీ లుక్లో ఇవి యూత్ ని ఆకర్షిస్తున్నాయి. అంతేకాక వాటిల్లోని ఫీచర్లు కూడా ఆకట్టుకుంటున్నాయి. వాటి పనితీరు, రేంజ్ కూడా అందరినీ వాటి వైపు చూసేలా చేస్తున్నాయి. మార్కెట్లో ఉన్న డిమాండ్ ను మరింతగా పెంచుకునేందుకు ఏథర్ కొత్త ఎక్స్ చేంజ్ స్కీమ్ ను పరిచయం చేసింది. ఇప్పటికే ఏథర్ ఎలక్ట్రిక్ స్కూటర్ కలిగి ఉన్న వినియోగదారులు తమ పాత పాత స్కూటర్లను ఇచ్చి కొత్త వాటిని తీసుకెళ్లొచ్చు. వాస్తవానికి ఈ ప్రొగ్రామ్ 2023 జనవరిలోనే ప్రారంభించింది ఏథర్ కంపెనీ. 2024 మార్చి 31 వరకూ ఈ ఎక్స్ చేంజ్ అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ ఏథర్ అప్ గ్రేడ్ ప్రోగ్రామ్ ఏంటి? వాటిల్లో ఏ స్కూటర్లను ఎక్స్ చేంజ్ చేసుకోవచ్చు? ఎంత మొత్తంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది? పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. ఏథర్ అప్ గ్రేడ్ ప్రోగ్రామ్ అనేది మార్చి 31 వరకూ అందుబాటులో ఉంటుంది. పాత మొడళ్లైన ఏథర్ 450 జెన్ 1 జెన్ 1.5 స్కూటర్లు కలిగి ఉన్న వారు ఏథర్ 450ఎక్స్ కి అప్ గ్రేడ్ కావొచ్చు. ఈ స్కూటర్ కావాలనుకుంటే మార్చి 31లోపు వారి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే ఏథర్ 450 అపెక్స్ మోడల్ తీసుకోవాలనుకుంటే మాత్రం వారికి ఏప్రిల్ 30 వరకూ సమయం ఉంటుంది. ఆ లోపు ఎక్స్ చేంజ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. పాత స్కూటర్ ఇవ్వడంతో పాటు కొత్త స్కూటర్ ను తీసుకెళ్లడం కూడా ఒకే రోజు పూర్తి చేయొచ్చు. ఈ ఎక్స్ చేంజ్ ప్రోగ్రామ్ కోసం మీ వాహనాన్ని ఏథర్ స్పేస్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అది బెంగళూరులోని ఇందిరానగర్లో ఉంటుంది. అక్కడ ఉన్న సిబ్బంది మీ పాత స్కూటర్ ను తనిఖీ చేసి, దాని కండిషన్ ను అంచనా వేస్తారు.

## మరోసారి లేఆఫ్స్ ప్రకటించిన యాపిల్....



**న్యూఢిల్లీ :** మరోసారి తన ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమయింది. Apple micoro LED ప్రాజెక్టును నిలిపివేసింది. కంపెనీ డిస్ ప్లే ఇంజినీరింగ్ టీంలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దంతోప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ టీంలకు చెంది ఉద్యోగులపై లేఆఫ్స్ ప్రభావం ఉండనుంది. విపరీతమైన ఖర్చులు, టెక్నాలజీ పరమైన కారణాలతో మైక్రో ఎల్ ఈడీ టెక్నాలజీ ప్రాజెక్టును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. స్మార్ట్ వాచ్ డిస్ ప్లేల కోసం మైక్రో ఎల్ ఈడీ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి ఆపిల్ తన ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. అయితే నిర్వహణ ఖర్చు, టెక్నాలజీ పరమైన కారణాలతో ఈ ప్రాజెక్టును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న చాలా మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. యూఎస్, ఆసియా పరిధిలోని ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. గతేడాది భారీగా లేఆఫ్స్ లు ప్రకటించిన టెక్ కంపెనీలు,..2024 లో కూడా అదే పరంపర కొనసాగిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే 50 వేల మంది ఉద్యోగులను తొలగించాయి టెక్ కంపెనీలు. కంపెనీ పునర్వవస్థీకరణ, ఖర్చుల తగ్గింపు,అప్ డేటెడ్ టెక్నాలజీ వినియోగం కొత్త వ్యాపారంలోకి ప్రవేశించడం వంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్ వేర్, హెల్త్ రంగంలోని కంపెనీలు ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి.

## మార్కెట్‌లోకి రానున్న కొత్త ఎలక్ట్రిక్ కార్లు!



**న్యూఢిల్లీ :** ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) సెక్టార్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో బండ్ల తయారీ కంపెనీలు కొత్త మోడల్స్‌ను తేవాలని ప్లాన్ చేస్తున్నాయి. టాటా మోటార్స్, హ్యుండాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకీ వంటి కంపెనీలు రానున్న కొన్నేళ్లల్లో కనీసం ఐదుకి పైగా ఈవీ మోడల్స్‌ను తీసుకొస్తామని ప్రకటించాయి. వచ్చే ఏడాది జనవరి నుంచి పెద్ద మొత్తంలో ఈవీ మోడల్స్‌ను లాంచ్ చేస్తామని మహీంద్రా అండ్ మహీంద్రా సీఈఓ (ఆటోమోటివ్) నలినికాంత్ గొల్లగుంట పేర్కొన్నారు.తమ ఇన్నోవేటివ్ ప్లాట్‌ఫామ్ ఇంగ్లోను బేస్ చేసుకోని ఐదు కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను తెస్తామని అన్నారు. 2027 నాటికి తమ కార్ల పోర్టుఫోలియోలో 30 శాతం ఎలక్ట్రిక్ వెహికల్సే ఉంటాయన్నారు. ఈవీ సెక్టార్‌పై ఫోకస్ పెట్టామని, భారీగా ఇన్వెస్ట్ చేస్తామని మారుతి సుజుకీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (కార్పొరేట్ అఫైర్స్) రాహుల్ భారతి పేర్కొన్నారు. ఫుల్ ఛార్జ్‌పై 550 కి.మీ వరకు ప్రయాణించే హై ఎండ్ ఎలక్ట్రిక్ కార్లను త్వరలో తయారు చేస్తామని అన్నారు. రానున్న ఏడు నుంచి ఎనిమిదేళ్లలో ఆరు ఈవీ మోడల్స్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఆయిల్ దిగుమతులను తగ్గించుకోవాలంటే కేవలం ఎలక్ట్రిక్ వెహికల్స్‌పైనే ఆధారపడకూడదని, హైబ్రిడ్-ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, బయో సీఎన్‌జీ, ఇథనాల్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వంటి ఆల్టర్నేటివ్ టెక్నాలజీలు అవసరమని వివరించారు.

## 52 శాతం పెరిగిన ఓటీటీ కంటెంట్ వ్యయం



ఓవర్-ది-టాప్ (ఓటీటీ) కంటెంట్ వ్యయం 2023లో 52శాతం పెరిగింది. గతేడాది క్రీడా హక్కుల విలువలు రెండింతలు పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం రూ. 12,500 కోట్ల మొత్తం ఓటీటీ కంటెంట్ వ్యయంలో క్రీడాహక్కుల వ్యయం దాదాపు 51శాతంగా ఉంది.

ఫిక్కీ ఈవై మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ నివేదిక ప్రకారం, మొత్తం ఓటీటీ ఖర్చులలో 24శాతం సినిమా హక్కులకు కేటాయించగా, అసలు కంటెంట్‌పై కేవలం పావు వంతు మాత్రమే ఖర్చు చేయబడింది. అయినప్పటికీ, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు మొత్తం కంటెంట్ గంటలలో కనిష్ట వృద్ధిని సాధించాయి. 2022 స్థాయిలతో పోలిస్తే 3,000 గంటల వద్ద స్థిరంగా ఉన్నాయి. అధిక మూలధన వ్యయం, పరిమిత మానిటైజేషన్‌కు క్రీడా హక్కులు పర్యాయ పదంగా మారాయి. ఈ విభాగంతో పోల్చిచూస్తే, వినోదపు షోలు, సినిమాలు వంటి క్రీడాయేతర అసలైన కంటెంట్‌ను ఉత్పత్తి చేయడానికి అయ్యే ఖర్చు నామమాత్రమే. ప్రసార సేవలు తమ వ్యూహాలను పునరుద్ధరిస్తాయని, ఏడాది పొడవునా సంబంధితంగా ఉండటానికి టోర్నమెంట్‌లకు ముందు, తర్వాత మరింత బలవంతపు కంటెంట్ స్లాట్‌లలో పెట్టుబడి పెట్టాలని మీడియా, వినోద పరిశ్రమ నిపుణులు తెలిపారు.

## ప్రభుత్వ బ్యాంకుల భారీ డివిడెండ్




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు మార్చితో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సరం(2023-24)లో భారీ డివిడెండ్‌ను చెల్లించే వీలుంది. ఇందుకు లాభదాయకత మెరుగుపడటం సహకరించనుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఈ ఏడాది పీఎస్‌యూ బ్యాంకులు రూ. 15,000 కోట్లకుపైగా డివిడెండును చెల్లించే అవకాశముంది. ఈ ఏడాది ఇప్పటికే తొలి మూడు త్రైమాసికాల(ఏప్రిల్-డిసెంబర్)లో 12 పీఎస్‌యూ బ్యాంకులు ఉమ్మడిగా రూ. 98,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి.గతేడాది(2022-23)లో ఉమ్మడిగా సాధించిన నికర లాభానికంటే రూ. 7,000 కోట్లుమాత్రమే తక్కువ. గతేడాదిలోనే ప్రభుత్వ బ్యాంకులు చరిత్రలోనే అత్యధికంగా రూ. 1.05 లక్షల కోట్ల నికర లాభం ప్రకటించాయి. అంతక్రితం ఏడాది(2021-22)లో కేవలం రూ. 66,540 కోట్ల నికర లాభం నమోదైంది. గతేడాది ప్రభుత్వం పీఎస్‌యూ బ్యాంకుల నుంచి 58 శాతం అధికంగా రూ. 13,804 కోట్ల డివిడెండ్‌ను అందుకుంది. అంతక్రితం ఏడాదిలో రూ. 8,718 కోట్ల డివిడెండ్ మాత్రమే చెల్లించాయి. వెరసి ఈ ఏడాది రికార్డ్ స్థాయిలో ప్రభుత్వానికి పీఎస్‌యూ బ్యాంకులు డివిడెండును చెల్లించనున్నట్లు అంచనా. కాగా.. ఆర్‌బీఐ తాజా నిబంధనల ప్రకారం నికర మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 6 శాతానికంటే తక్కువగా నమోదైన బ్యాంకులు మాత్రమే డివిడెండ్ ప్రకటించేందుకు వీలుంటుంది. అయితే వచ్చే ఏడాది(2024-25) నుంచి మాత్రమే తాజా మార్గదర్శకాలు అమలుకానున్నాయి.

## 'సిప్' చేసే ఆలోచనలో ఉన్నారా? ఇది తెలుసుకోకపోతే కష్టం

అసలు మ్యూచువల్ ఫండ్స్ అంటే ఏమిటి? వాటిల్లో ఎస్ఐపీలు ఎలా ఉంటాయి? నిబంధనలు ఏమిటి? కావాల్సిన పత్రాలు ఏమిటి? వంటి వాటిపై కనీస అవగాహన అవసరం. ఒకవేళ మీరు తొలిసారి ఏదైనా ఎస్ఐపీ ప్రారంభించాలని ప్లాన్ చేస్తుంటే.. ఈ కథనం మీకు బాగా ఉపకరిస్తుంది. దీనిలో ఎస్ఐపీ ప్రారంభించేందుకు అవసరమైన పూర్తి సమాచారం అందిస్తున్నాం. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య పెరుగుతోంది. అందులోనూ సిస్టమాటిక్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్(ఎస్ఐపీ)లకు డిమాండ్ అధికంగా ఉంటుంది. దీనిలో మధ్య తరగతి వారు కూడా అధికంగా పెట్టుబడులు పెడుతున్నారు. ఎక్కువ రాబడులు వస్తున్నాయన్న కారణంతో వీటివైపు మొగ్గుచూపుతున్నారు. అయితే వీటిల్లో పెట్టుబడులు పెట్టే ముందు అసలు మ్యూచువల్ ఫండ్స్ అంటే ఏమిటి? వాటిల్లో ఎస్ఐపీలు ఎలా ఉంటాయి? నిబంధనలు ఏమిటి? కావాల్సిన పత్రాలు ఏమిటి? వంటి వాటిపై కనీస అవగాహన అవసరం. ఒకవేళ మీరు తొలిసారి ఏదైనా ఎస్ఐపీ ప్రారంభించాలని ప్లాన్ చేస్తుంటే.. ఈ కథనం మీకు బాగా ఉపకరిస్తుంది. దీనిలో ఎస్ఐపీ ప్రారంభించేందుకు అవసరమైన పూర్తి సమాచారం అందిస్తున్నాం. బ్యాంక్ ఖాతా, నామిని వంటివి ఇవ్వడంతో పాటు మీకు అధిక రాబడులు అందించే బెస్ట్ స్కీమ్ ను ఎలా ఎంపిక చేసుకోవాలో కూడా వివరిస్తున్నాం. మీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను ప్రారంభించడానికి, మీకు పాన్ కార్డ్, చిరునామా రుజువు (ఆధార్ వంటివి), రద్దు చేసిన చెక్ కాపీ అవసరం. మీరు భౌతిక పెట్టుబడిని ఎంచుకుంటే (ఫండ్ హౌస్ కార్యాలయం లేదా పంపిణీదారు వద్ద ఆఫ్ లైన్ మోడ్), ఈ పత్రాలు అవసరం. అలాగే మ్యూచువల్ ఫండ్ అప్లికేషన్లోని పేరు పాన్ రికార్డ్ ఉన్న పేరుతో సరిగ్గా సరిపోవాలి. పాన్ రికార్డులో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే సరిచేయాలి. పాన్ రికార్డ్లోని పేరు, పుట్టిన తేదీ, మ్యూచువల్ ఫండ్ అప్లికేషన్లో పూర్తిగా సరిపోలాలని ఆదాయపు పన్ను శాఖ ఆదేశించింది. ఏదైనా తేడా ఉంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్లు, రిడెంప్టన్ అభ్యర్థనలతో సహా లావాదేవీల తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. సరైన పెట్టుబడి పథకం ఎంపిక అనేది టైం హొరిజోన్, రిస్క్ ప్రొఫైల్, పన్ను చిక్కులు వంటి అంశాల ఆధారంగా ఉండాలి. ఉదాహరణకు, మీరు 1-2 సంవత్సరాల హెరిరిజోన్ కోసం పెట్టుబడి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటే, కొంత నష్టాన్ని తట్టుకోగలిగితే, పన్ను సామర్థ్యాన్ని కోరుకుంటే, స్వచ్ఛమైన ఈక్విటీ ఫండ్ లేదా డెట్ స్కీమ్ కంటే ఈక్విటీ సేవింగ్స్ ఫండ్ ఉత్తమ ఎంపిక కావచ్చు. డెట్ ఫండ్ను ఎంచుకోవడం వలన మీ ఆదాయానికి అనుగుణంగా లాభాలపై పన్ను పడుతుంది. అయితే ఈక్విటీ ఫండ్ మార్కెట్లు క్షీణిస్తే స్వల్పకాలిక నష్టాలకు దారి తీస్తుంది. పథకాన్ని మధ్యలో మార్చడం వలన నిష్క్రమణ లోడ్ లేదా అధిక స్వల్పకాలిక మూలధన లాభాల పన్నుకు దారి తీయవచ్చు. యాక్టివ్ బ్యాంక్ ఖాతాను మీ ఫోలియోకి లింక్ చేయడం చాలా కీలకం. మీరు మ్యూచువల్ ఫండ్ స్కీమ్ ను రీడీమ్ చేసినప్పుడు, ఖాతా ప్రారంభ ఫారమ్లో పేర్కొన్న బ్యాంక్ ఖాతాకు డబ్బు క్రెడిట్ అవుతుంది. కాబట్టి, ఈ ఖాతా నిష్క్రియంగా మారకుండా చూసుకోండి. అలాగే, ముందుగా మీ ఫోలియోను కొత్త బ్యాంక్ ఖాతాతో అప్డేట్ చేయకుండా దాన్ని మూసివేయవద్దు. విముక్తి అభ్యర్థన చేసుకుంటే.. ఫండ్ హౌస్ నేరుగా మీ ఖాతాకు క్రెడిట్ చేయలేకపోతే, చెక్ పంపిస్తుంది., ఇది ఎన్క్యాష్ చేయడానికి అదనంగా 5-7 రోజులు పట్టవచ్చు. సరైన నామినీని కలిగి ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే మీ ప్రియమైనవారు వారి సరైన వాటాను వెంటనే, సమస్యలు లేకుండా అందుకుంటారు.

## ఆ పథకంలో పెట్టుబడితో భోలెడంత పన్ను ఆదా....!

### ఉద్యోగులకు మాత్రమే కలిగే లాభాలివే..!




ఉద్యోగులు పదవీ విరమణ కోసం తగినంత డబ్బును ఆదా చేసుకోవాలి. ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) నుంచి ప్రయోజనం పొందవచ్చు. ఈపీఎఫ్ అనేది పదవీ విరమణ సొమ్మును నిర్మించడంలో ప్రజలకు సహాయపడటానికి రూపొందించబడిన పొదుపు పథకం. ఇది 1952లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్ చట్టం కింద స్థాపించారు. ఈపీఎఫ్ పథకంలో ఉద్యోగులు ప్రతి నెలా వారి ప్రాథమిక ఆదాయంలో 12 శాతం విరాళంగా అందించాలి. మార్చి నెల వచ్చిందంటే ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా అంతా పన్ను చెల్లింపుల్లో ఆదా చేయడానికి ఉండే పథకాల గురించి అన్వేషిస్తూ ఉంటారు. ముఖ్యంగా మీరు జీతం పొందే ఉద్యోగి అయితే జీవనశైలిని కొనసాగిస్తూ మీ రోజువారీ ఖర్చులను మీరు నిర్వహిస్తూ ఉంటారు. ఉద్యోగులు పదవీ విరమణ కోసం తగినంత డబ్బును ఆదా చేసుకోవాలి. ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) నుంచి ప్రయోజనం పొందవచ్చు. ఈపీఎఫ్ అనేది పదవీ విరమణ సొమ్మును నిర్మించడంలో ప్రజలకు సహాయపడటానికి రూపొందించబడిన పొదుపు పథకం. ఇది 1952లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్ చట్టం కింద స్థాపించారు. ఈపీఎఫ్ పథకంలో ఉద్యోగులు ప్రతి నెలా వారి ప్రాథమిక ఆదాయంలో 12 శాతం విరాళంగా అందించాలి. యజమాని ఈ మొత్తానికి సరిపోతుంది. మీరు పదవీ విరమణ చేసినప్పుడు మీరు వడ్డీతో సహా మొత్తం మొత్తాన్ని అందుకుంటుంది. ఈపీఎఫ్ తక్కువ రిస్క్ పెట్టుబడిగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది భారత ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇది స్థిరమైన రాబడికి హామీ ఇస్తుంది. యజమాని సహకారంలో దాదాపు 8.33 శాతం వడ్డీ రహిత ఎంప్లాయి పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్)కి కేటాయించవచ్చు.

మీ నెలవారీ ప్రాథమిక జీతం రూ. 1,00,000, మీ ఈపీఎఫ్ సహకారం రూ. 12,000 (మీ ప్రాథమిక జీతంలో 12 శాతం), మీరు సెక్షన్ 80 సీ కింద సంవత్సరానికి రూ. 1,44,000 (12 %ఇ% రూ. 12,000) తగ్గింపును క్లెయిమ్ చేయవచ్చు. ఇది మీ పన్ను విధించదగిన ఆదాయాన్ని తగ్గిస్తుంది. ఈపీఎఫ్ సభ్యులకు ఆధారపడిన రిటైర్మెంట్ ఫండ్ మూలాన్ని అందించడమే కాకుండా పన్ను ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఇది దాని దీర్ఘకాలిక పెట్టుబడి సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈపీఎఫ్ అనేది పదవీ విరమణ ప్రణాళిక కోసం కావాల్సిన ఎంపికగా ఉంటుంది. సెక్షన్ 80 సీ కింద రూ. 1,50,000 వరకు తగ్గింపులను అనుమతిస్తుంది.

# ఎంఎల్ఏ మాగంటి వర్సెస్ రావుల శ్రీధర్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణ భవన్ వేదికగా బిఆర్ఎస్ నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ ఎంఎల్ఏ మాగంటి గోపీనాథ్, బిఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి మధ్య గొడవ జరిగింది. వేదికపైనే అందరూ చూస్తుండగానే సీనియర్ నేతలు ఒకరినొకరు తిట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డిపై మాగంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిన్ను ఎవడ్రా పిలిచింది' అని మాగంటి గోపినాథ్ మండిపడ్డారు. 'నిన్ను ఎవడు పిలిచిండ్రా.. నువ్వేవడివి'.. నాకు చెప్పేదంటూ రావుల శ్రీధర్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. వెంటనే ఎంఎల్ఏ తలసాని శ్రీనివాస్ యాదవ్ కల్పించుకుని ఇరువురు నేతలకు సర్ది చెప్పారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఈ క్రమంలోనే వేదిక కింద ఉన్న బిఆర్ఎస్ క్యాడర్ కొంత అసంతృప్తికి లోనయ్యారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్....



షాద్ నగర్: రహదారులకు సమీపంలో ఉన్న ఇండ్లే వారి టార్గెట్.. ఇంటికి తాళం కనిపించిందో ఇక అంతే సంగతి, పగలంతా రెక్కీలు నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతూ, అదేవిధంగా చైన్ స్నాచింగ్ చేస్తూ దొరికిందంతా దోచుకుంటున్న మహారాష్ట్ర గ్యాంగ్ ను ఎట్టకేలకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో షాద్ నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం స్థానిక ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో మీడియా సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర గ్యాంగ్ చేసిన 23 దొంగతనాలకు సంబంధించిన పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను మీడియా ముందు పెట్టారు. షాద్ నగర్, ఆమన్ గల్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, కేశంపేట, నందిగామ, పహాడి షరీఫ్, మహేశ్వరం, కందుకూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నిందితులు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా వైజాపూర్ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు రాజీవ్ శంకర్ పవర్, అదేవిధంగా నాగపూర్ కు చెందిన అజయ్ సర్కస్ పవర్, తుల్జాపూర్ గ్రామానికి చెందిన అమూల్ అలియాస్ షిండే, అలాగే మహారాష్ట్రలోని వైజపూర్ తాలూకా గొల్వడి గ్రామానికి చెందిన పవన్ మచీంద్ర, నాగపూర్ గ్రామానికి చెందిన ఎల్వాతిలు అంతరాష్ట్ర దొంగల ముఠాగా ఏర్పడి 23 చోరీలకు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్, ఆమన్ గల్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, కేశంపేట, నందిగామ, పహాడి షరీఫ్, మహేశ్వరం, కందుకూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడగా పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేశారు. షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు దొంగతనాలు చేయగా, కొత్తూరులో ఒకటి, కడ్తాల్ మండలంలో రెండు, మహేశ్వరం మండలంలో రెండు, కందుకూర్ మండలంలో రెండు, నందిగామ మండలంలో ఒకటి, కేశంపేట పరిధిలో ఒకటి, శంషాబాద్ పరిధిలో మూడు, ఆమన్గల్ పరిధిలో నాలుగు దొంగతనాలు చేశారని శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి కేసులతో సహా మీడియా ముందు వివరించారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో 23 కేసులు నమోదై ఉన్నాయని వివరించారు. ఇందులో ఇద్దరిని ఈనెల 14న సాంకేతిక సాక్షాదారాలతో సహా అదుపులోకి తీసుకున్నట్టు డీసీపీ వివరించారు. రాజీవ్ శంకర్ పవర్, పవన్ మచ్చింద్ర ఇద్దరిని అదుపులోకి తీసుకొని 30 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 23 కేసుల్లో బాధితులకు వారికి సంబంధించిన బంగారు ఆభరణాలను కోర్టు ద్వారా అందజేస్తామని డిసిపి వివరించారు.

# ప్రణీత్ రావు ఎవరో నాకు తెలియదు: ఎర్రబెల్లి



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రణీత్ రావు ఎవరో కూడా తనకు తెలియదని చెప్పారు. మంగళవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను కావాలనే ఇరికిస్తున్నారన్నారు. ప్రణీత్ రావు తనకు తెలియదు కాని.. ఆయన బంధువులు మాత్రం తన ఊరిలోనే ఉన్నట్లు చెప్పారు. గతంలో తనను ఇబ్బంది పెట్టాలని చాలా ప్రభుత్వాలు ప్రయత్నించాయి.. కాని, వాటి వల్ల కాలేదన్నారు. శరణ్ చౌదరి అనే వ్యక్తి తనపై ఆరోపణలు చేసినట్లు మీడియాలో చూశానన్నారు. దీంతో శరణ్ ఎవరని విచారించగా.. అతడు బీజేపీలో ఉన్నట్లు తెలిసిందన్నారు. భూముల దందాలు, మోసాలు చేస్తున్నాడని అతడిని బీజేపీ తొలగించిందని చెప్పారు. ఎన్నారైలను కూడా కోట్ల రూపాయాలు మోసం చేసినట్లు తెలిసిందని.. అతనితో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. 40 ఏండ్ల రాజకీయ జీవితంలో నిజాయితీగా పనిచేశానని.. అక్రమ దందాలు, భూ కబ్జాలు చేయలేదని చెప్పారు. విజయవాడకు చెందిన విజయ్ అనే ఎన్నారై దగ్గర శరణ్ చౌదరి రూ. 5 కోట్లు తీసుకున్నాడని చెప్పారు. విజయ్ ఎవరో తనకు పరిచయం లేదని వెల్లడించారు. ఎన్నారైలు విజయ్‌ని తన దగ్గరికి తీసుకొచ్చారని, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించాని తెలిపారు. శరణ్ చౌదరిపై అనేక చీటింగ్ కేసులు ఉన్నాయని, అతనితోపాటు ఆయన భార్య పాస్ పోర్ట్ కూడా పోలీసులు సీజ్ చేశారని తెలిపారు. రాజకీయంగా తనను దెబ్బ తీయాలని కొందరు తనపై కుట్ర చేస్తున్నారని.. అందులో భాగంగానే తనను తప్పుడు కేసులో ఇరిక్కించాలని చూస్తున్నట్లు ఎర్రబెల్లి చెప్పారు.

# మోదీని ఆపాలంటే కేసీఆర్, కేజ్రీవాల్, మమతకే సాధ్యం : కేటీఆర్



హైదరాబాద్ : ప్రధాని మోదీని ఆపాలంటే కేసీఆర్, కేజ్రీవాల్, మమతా బెనర్జీకే సాధ్యమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మోదీని ఆపడం కాంగ్రెస్‌తో సాధ్యపడదు అని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంట్ సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేసే ప్రయత్నం చేశారు. బీజేపోళ్లకు బీఆర్ఎస్ బీ టీం అని చెప్పి మైనార్టీ సోదరుల్లో విషం నింపే ప్రయత్నం చేశారు. కానీ హైదరాబాద్‌లో ఎవరూ నమ్మలేదు. బీఆర్ఎస్‌ను ముస్లింలు నమ్మారు. అన్ని నియోజకవర్గాల్లో గెలుపొందాం అని కేటీఆర్ గుర్తు చేశారు. కవితమ్మను అరెస్టు చేయలేదు అందుకు వారు ఒక్కటే అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెసోళ్ల అన్నారు. సుప్రీంకోర్టులో కేసు ఉండే, స్టే ఉండే కాబట్టి అరెస్టు చేయలేకపోతయారు. ఆ తర్వాత పగబట్టి ఇంటికి వచ్చి అరెస్టు చేశారు. కవితమ్మనే కాదు.. ఇద్దరు ముఖ్యమంత్రులను కూడా అరెస్టు చేశారు. మోదీ మొత్తం ప్రతిపక్షాలను అరెస్టు చేసే ప్రయత్నంలో ఉన్నారు. మరి ఇవాళ కాంగ్రెస్ దీనికి ఏం సమాధానం చెబుతది..? కేవలంగా బలంగా ఉన్న ప్రాంతీయ నాయకులు మాత్రమే మోదీని ఆపుతున్నారు. కాంగ్రెస్‌కు మోదీని అడ్డుకునే స్థాయి లేదు.

# కాంగ్రెస్‌లో చేరితే సంతోషిస్తాం



న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్‌లోని పిలిభిత్ నియోజకవర్గం సిట్టింగ్ ఎంపి వరుణ్ గాంధీకి బిజెపి లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆయనకు కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందించింది. తమ పార్టీలోకి వరుణ్ గాంధీని సాదరంగా ఆహ్వానిస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి మంగళవారం తెలిపారు. వరుణ్ గాంధీ మూలాలు గాంధీ కుటుంబంలో ఉన్న కారణంగానే ఆయనకు బిజెపి టిక్కెట్ నిరాకరించిందని పశ్చిమ బెంగాల్ పిసిసి అధ్యక్షుడు చౌదరి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరాలని, మచ్చలేని నిజాయితీపరుడైన వరుణ్ గాంధీ తమ పార్టీలో చేరితే తామంతా సంతోషిస్తామని చౌదరి తెలిపారు. వరుణ్ గాంధీ చాలా ఉన్నత భావాలు గల నాయకుడని, మంచి విద్యావంతుడైన రాజకీయ నేతని ఆయన చెప్పారు. ఆయన వ్యక్తిత్వం పారదర్శకమని, ఆయనకు గాంధీ కుటుంబంతో కూడా సత్సంబంధాలు ఉన్నాయని చౌదరి చెప్పారు. ఈ కారణంగానే ఆయనకు బిజెపి టిక్కెట్ నిరాకరించిందని ఆయన చెప్పారు. వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లోకి రావాలని తామంతా కోరుకుటున్నట్లు ఆయన తెలిపారు. బిజెపి ఆదివారం(మార్చి 24) విడుదల చేసిన లోక్‌సభ అభ్యర్థుల ఐదవ జాబితాలో పిలిభిత్ స్థానంలో సిట్టింగ్ ఎంపిగా ఉన్న 44 ఏళ్ల వరుణ్ గాంధీకి చోటు దక్కలేదు. వరుణ్ గాంధీ తప్పించి 2021లో కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేరిన జితిన్ ప్రసాదకు చోటు కల్పించింది. అయితే సుల్తాన్‌పూర్ నియోజకవర్గంలో మాత్రం వరుణ్ గాంధీ తల్లి మేనకా గాంధీకి మాత్రం బిజెపి మరోసారి పోటీ చేసే అవకాశాన్ని కల్పించింది. అయితే..బిజెపి తనకు సీటు నిరాకరించడం పట్ల వరుణ్ గాంధీ తీవ్ర మనోవ్యథకు గురైనట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. తనను బిజెపి మోసం చేసిందని రగిలిపోతున్న వరుణ్ గాంధీ ఈసారి ఎన్నికల్లో పోటీ చేయకూడదని భావిస్తున్నట్లు వారు చెప్పారు. జాబితా విడుదల కావడానికి ముందే వరుణ్ గాంధీ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు కొనుగోలు చేయడంతోపాటు ఎన్నికల ప్రచారం కోసం పిలిభిత్‌లోని ప్రతి గ్రామంలో రెండు కార్లు, 10 మోటారుసైకిళ్లు సిద్ధంగా ఉంచాలని తన అనుచరును ఆదేశించారని వారు చెప్పారు. అయితే బిజెపి టిక్కెట్ నిరాకరించినప్పటి నుంచి వరుణ్ గాంధీ నుంచి ఎటువంటి సందేశం ఆయన అనుచరులకు రాలేదని వారు చెప్పారు. ఒకవేళ బిజెపి టిక్కెట్ రాని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవాలని ఈ నెల మొదట్లో వరుణ్ గాంధీ భావించినట్లు వర్గాలు తెలిపాయి. అయితే తన భవిష్యత్ కార్యాచరణ గురించి వరుణ్ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా..ఉత్తర్ ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ప్రభుత్వంపైన వరుణ్ గాంధీ అఏనేక సందర్భాలలో తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయనకు టిక్కెట్ దక్కకపోవడం వెనుక ఇది కూడా ఒక కారణం కావచ్చన్న ప్రచారం జరుగుతోంది.బిజెపి విధానాల పైన కూడా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఆయన గతంలో ప్రశ్నించారు.

# 'ఇవి చావో రేవో తేల్చే ఎన్నికలు'

- ఇండియా భావం కొనసాగుదలను నిర్ణయిస్తాయి
- కాంగ్రెస్ వెటరన్ ఎకె ఆంటోనీ
- ఆరోగ్యం అనుమతిస్తే ప్రచారంలో పాల్గొంటా



తిరువనంతపురం : కాంగ్రెస్ వెటరన్ నేత ఎకె ఆంటోనీ రానున్న లోక్‌సభ ఎన్నికలను 'చావో రేవో తేల్చే ఎన్నికలు' అని మంగళవారం అభివర్ణించారు. 'ఇండియా భావన కొనసాగుతుందా అని నిర్ణయించే ఎన్నికలు ఇవి అని ఆయన పేర్కొన్నారు. తన ఆరోగ్యం అనుమతించినట్లయితే యుడిఎఫ్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానని ఆయన చెప్పారు. బిజెపి అభ్యర్థి అయిన తన కుమారునికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తానని కూడా ఆంటోనీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలలో యుడిఎఫ్ అభ్యర్థి తరఫున ప్రచారానికి పథనంతిట్టకు వెళతారా అని విలేకరులు అడిగినప్పుడు 'నా ఆరోగ్య స్థితిపై అంతా ఆధారపడి ఉంటుంది' అని ఆంటోనీ సమాధానం ఇచ్చారు. ఆయన కుమారుడు అనిల్ కె ఆంటోనీని పథనంతిట్టలో బిజెపి తమ అభ్యర్థిగా నిలబెట్టినందున వెటరన్ ఆంటోనీని విలేకరులు ఆ ప్రశ్న వేశారు. పథనంతిట్టలో అనిల్ కె ఆంటోనీ సిట్టింగ్ యుడిఎఫ్ ఎంపి ఆంటో ఆంటోనీని, అధికార ఎల్‌డిఎఫ్ అభ్యర్థి, సీనియర్ సిపిఐ(ఎం) నేత, మాజీ మంత్రి టిఎం థామస ఐజాక్‌ను ఢీకొంటున్నారు. ప్రధాని నరేంద్ర మోడీపై బిబిసి నిర్మించిన వివాదాస్పద డాక్యుమెంటరీ చిత్రంపై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ అనిల్ నిరుడు ఆ పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. అనిల్ తరఫున ప్రచారం చేయడానికి ప్రధాని మోడీ క్రితం వారం పథనంతిట్టకు వచ్చారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి, దీర్ఘ కాలం రక్షణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఎకె ఆంటోనీ ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా కేరళ రాజధానిలోని తన నివాసంలో గడుపుతున్నారు.

# బీజేపీకి నచ్చినోళ్లు వారి జేబుల్లో ఉండాలి.. నచ్చనోళ్లు జైల్లో ఉండాలి : హరీశ్‌రావు



సంగారెడ్డి : కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బీజేపీకి నచ్చినోళ్లు వారి జేబుల్లో ఉండాలి.. నచ్చనోళ్లు జైల్లో ఉండాలి.. కవితతో పాటు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. లొంగకపోతే ప్రతిపక్ష పార్టీల మీద కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ బీజేపీతో ఎప్పుడూ కలిసేది లేదు.. బీఆర్ఎస్ లౌకిక పార్టీ అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రచారం చేశారు. కానీ ఇవాళ ఏం జరుగుతుందో మీరంతా చూస్తున్నారు. బీజేపీ ఏ ఒక్కరిలోనూ మార్పు తేలేదు. బీఆర్ఎస్ గెలవాలి.. తెలంగాణ నిలవాలి అనే నినాదంతో ఎన్నికల ప్రచారం చేయాలి. తెలంగాణ కోసం నిఖార్సుగా పోరాడే పార్టీ బీఆర్ఎస్. కాంగ్రెస్, బీజేపీకి 100 ఎజెండాలు ఉంటాయి. వారి అవసరాల కోసం కాంప్రమైజ్ అవుతాయి. తెలంగాణ హక్కుల కోసం ఎలాంటి రాజీ లేకుండా పోరాటం చేసే పార్టీ బీఆర్ఎస్ అని ప్రజల్లోకి తీసుకోవాలి. రాత్రింబవళ్లు కష్టపడి గులాబీ జెండాను గెలిపించుకుందాం అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముస్లింలకు పెద్ద పీట వేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం, రెవెన్యూ , హోం మినిస్టర్ పదవి ముస్లింలకు ఇచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లిం మంత్రులెవరూ లేరు. గతంలో బడ్జెట్‌లో కూడా అధిక కేటాయింపులు చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు బట్టలు పంపిణీ చేశారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేశారు. పిల్లలు గొప్పగా చదువుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే లాభం లేదు. సెక్యూలర్ పార్టీ బీఆర్ఎస్. సెక్యులర్ నాయకుడు కేసీఆర్. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనడం కాదు.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నాం. ప్రతిపక్ష నాయకులను బెదిరించి, అక్రమ కేసులు పెట్టి, కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారు. వెంకట్రామిరెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి అని హరీశ్‌రావు కోరారు.

# కాళ్లు పట్టుకుంటాం సారూ.. పంటలకు నీళ్లవ్వండి



పెద్దపల్లి : కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే కరెంట్ కోతలతో ఇబ్బంది పడు తున్న అన్నదాతలు నేడు పంటలకు నీళ్లు లేక అరిగోస పడుతున్నారు. అప్పులు చేసి పంటలు వేస్తే కండ్లే ముందే ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు రోడ్ల మీదికొచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన రైతులు మంథని–గోదావరిఖని ప్రధాన రహదారిపై ధర్నానిర్వహించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com